నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | జనవరి 24, 2024 | www.navatelangana.com

పలు ప్రయివేటు స్కూళ్లల్లో తనిఖీలు

- నవతెలంగాణ కథనానికి విద్యాశాఖాధికారుల స్పందన

నవతెలంగాణ-కామారెడ్డి

పలు ప్రయివేటు స్కూళ్లను విద్యాధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఈవోతో పాటు పలువురు అధికారులు సందర్శించారు. పలు ప్రయివేటు స్కూళ్లల్లో పదో తరతగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల పేరిట క్లాస్‌లు నిర్వహించేందుకు అదనంగా ఫీజు వసూళ్లపై 'స్పెషల్ దోపిడీ' శీర్షికతో నవతెలంగాణ కథనం ప్రచురించిన విషయం విధితమే. దీంతో స్పందించిన జిల్లా అధికారులు మంగళవారం ప్రైవేట్ పాఠశాలలపై తనిఖీలు నిర్వహించారు. భిక్కనూర్‌లోని రెండు ప్రయివేటు స్కూళ్ల యజమానులను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయనికి పిలిపించి మాట్లాడారు. ప్రైవేటు తరగతుల పేరుతో అదనంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చిరుత సంచారం

హాస్గుల్, పుల్కల్ వాసుల్లో భయంభయం

నవతెలంగాణ-బిచ్కుంద


పాదముద్రలు పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

బిచ్కుంద మండలంలోని హస్గుల్, పుల్కల్ గ్రామ శివారులలోని పంట పొలాలలో రైతులు పనులు చేస్తుండగా చిరుత పులి సంచరిస్తుండడం గమనించిన రైతులు అక్కడ నుండి పరుగులు తీశారు. పుల్కల్ గ్రామ రైతులు వైస్ ఎంపీపీ రాజు పటేల్ దృష్టికి చిరుత పులి సంచరించడం విషయం తీసుకురాగా ఆయన వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. చిరుత పులి సంచరించిన పంట పొలాల్లో ఫారెస్ట్ అధికారులు చేరుకొని చిరుత పులి సంచరించిన పాదముద్రల ఆనవాలను గమనించారు. రైతులు పంట పొలాల్లో పని చేసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఫారెస్ట్ అధికారులు రైతులకు సూచించారు.

బిచ్కుందలో ఆఫీస్.. మద్నూర్ స్టాంప్

- అనాధికారికంగా ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం తరలింపు..?
- మద్నూర్ నుంచి తరలిన ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయం
- ఆదేశాలు రాకున్నా.. అధికారుల అత్యుత్సాహం
- స్పందించని సంబంధిత శాఖ అధికారులు
- పాడుబడ్డ భవనంలా మారిన సబ్‌డివిజన్ ఆఫీస్

నవతెలంగాణ-మద్నూర్



ఖాళీగా ఉన్న కార్యాలయం

ప్రభుత్వ కార్యాలయం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించాలంటే అందుకు ప్రభుత్వ అనుమతించి అధికారిక ఉత్తర్వులు విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ పలువురు అధికారుల అత్యుత్సాహమో.. ఎవరైనా ఒత్తిడి తీసుకొచ్చారో తెలియదు కానీ.. అనధికారికంగా ఒక ప్రభుత్వ కార్యాలయాన్ని ఒక మండలం నుంచి మరో మండలానికి తరలించారు. పైగా ఇప్పటికీ స్టాంప్‌లో పాత మండలం పేరుతో కొనసాగిస్తుండటం గమనార్హం.

మద్నూర్ మండల కేంద్రంలో గల ఆర్డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయం మూడు సంవత్సరాల క్రితం ఇక్కడి నుండి బిచ్కుందకు తరలిపోయింది. తరలిపోయిన ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం ప్రభుత్వ ఆదేశాల అనుసారంగా అధికారికంగా వెళ్లిందా.. లేకుంటే అనధికారికంగా అధికారుల ఇష్టారాజ్యంగా తరలించారా అనేది మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే కార్యాలయం తరలించి దాదాపుగా మూడేండ్లవుతున్నట్టు సమాచారం. మంగళవారం కార్యాలయాన్ని నవతెలంగాణ సందర్శించగా.. కార్యకలాపాలు ఏమీ సాగుతున్న దాఖలాలు కనిపించలేదు.

బిచ్కుందలో కార్యాలయ.. మద్నూర్ స్టాంప్

మద్నూర్ పాత తాలూకా కేంద్రం. మొదట నుండి ఆర్డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయం కార్యకలాపాలు ఇక్కడి నుంచి కొనసాగుతుండేవి. ఈ మధ్య కాలంలో కొన్ని సంవత్సరాల కాలంగా ఆ కార్యాలయం ఇక్కడ కనిపించకుండా తరలిపోవడం ఆ కార్యాలయ బిల్డింగు ఎవరి ఆధీనంలో ఉందో ఎవరికి తెలియని పరిస్థితి నెలకొంది. ఆ పాత బిల్డింగు పాడు బడినట్లయింది. దానికి ఏ ఒక్కరు చూడకపోవడం కుక్కలకు పందులకు రాత్రి వేళల్లో ఇతరత్రా పనులకు అడ్డగా మారిందని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. మద్నూర్ పాత తాలూకా కేంద్రంలో కొనసాగే ఆర్డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయం ఇక్కడి నుండి బిచ్కుందకు తరలిపోవడం అంతర్యం ఏమిటని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే కార్యాలయం బిచ్కుందకు తరలినా.. మద్నూర్ నుంచే కార్యాకలాపాలు కొనసాగిస్తున్నట్టు స్టాంప్‌ల మీద ఇప్పటికీ మద్నూర్ అని పేరు ఉండటం గమనార్హం. అధికారికంగా ఇతర మండలానికి తరలితే స్టాంప్‌లో సదరు మండలం పేరు రావాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా మద్నూర్ పేరుతో కొనసాగుతుండటం గమనార్హం. మద్నూర్ నుండి తరలిపోయిన ఆర్డబ్ల్యూఎస్ శాఖ కార్యాలయంపై అధికారంలోకి వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా విచారణ చేపట్టి తరలిపోయిన కార్యాలయాన్ని మళ్లీ మద్నూర్‌లోనే కొనసాగించేలా చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు. ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు ప్రత్యేకంగా దృష్టిసారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అందుబాటులోకి రాని అధికారులు..?

కార్యాలయం తరలింపుపై సదరు అధికారుల వివరణ కోరేందుకు నవతెలంగాణ యత్నించగా.. ఎవరూ స్పందించక పోవడం గమనార్హం. ఆర్డబ్ల్యూఎస్ శాఖ డిప్యూటీ ఇంజనీర్ అరవింద్ కుమార్‌కు ఫోన్ ద్వారా వివరణ కోరెందుకు పలుమార్లు ప్రయత్నం చేసినా అందుబాటులోకి రాలేరు. ఆర్డబ్ల్యూఎస్ శాఖ వివరణ ఇవ్వకపోవడం చూస్తుంటే తరలిపోయిన కార్యాలయాలు అనధికారికంగానే తరలంచినట్టు స్పష్టమవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే ప్రత్యేకంగా చొరవ చూపాలని మద్నూర్ మండల ప్రజలు కోరుతున్నారు.



ఉత్తమ పోలీస్ సిబ్బందికి అవార్డులు అందజేస్తున్న ఎస్పీ

మహిళల రక్షణకు పెద్దపీట వేయాలి

- జిల్లా ఎస్పీ సింధు శర్మ

నవతెలంగాణ-కామారెడ్డి

మహిళల రక్షణకు పెద్దపీట వేయాలని జిల్లా ఎస్పీ సింధు శర్మ సూచించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం పోలీసులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్ లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి డిఎస్పి, సిఐలను, ఎస్ఐలను అడిగి కేసు ఫైల్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, పేకాట, జూదం, తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఉక్కు పాదంతో అణిచివేయాలని సూచించారు.

మిస్సింగ్ కేసులలో ప్రత్యేక దృష్టి సారించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మిస్సింగ్ కేసులను ఛేదించాలని తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దనీ, శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలన్నారు. నేరాలు జరగకుండా ప్రో యాక్టివ్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి సమూలంగా నిర్మూలించాలన్నారు. అధికారులు సిబ్బంది టీమ్ వర్క్ తో ముందుకు వెళ్లాలలని, ప్రతి అధికారి పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలను ఉక్కుపాదంతో అణిచివేయాలని, అధికారులను ఆదేశించారు. కేసులలో పారదర్శకంగా ఇన్వెస్టిగేషన్ చేయాలని, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ వాటి బరిన పడకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

రివర్స్ పంప్ హౌస్‌ను సందర్శించిన అధికారులు



పంప్‌హౌజ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-ముప్కాల్

గోదారవి రివర్స్ మేనేజ్మెంట్ బోర్డు (జీఆర్ యంబి) బోర్డు సభ్యులు మంగళవారం ముప్కాల్ మండల శివారులోని జీరో పాయింట్ వద్ద నిర్మించిన కాళేశ్వరం రివర్స్ పంప్ హౌస్‌ను పరిశీలించారు. ఉత్తర తెలంగాణ వరప్రదాయని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఇందిరమ్మ వరద కాలువకు కొనసాగుతున్న నీటి విడుదలను సైతం క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా పంప్ హౌస్‌లో సందర్శణార్థులకు తెలియజేసేలా ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునర్జీవనం పనుల పర్యవేక్షణ చార్టును సందర్శించారు. పంప్‌హౌస్ పనుల వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టును పరిశీలించిన వారిలో గోదారవి రివర్స్ మేనేజ్మెంట్ బోర్డు సభ్యులు రాజీవ్ కుమార్, ప్రసాద్ ఎస్ఈ, రమణ మూర్తి ఈఈ, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎస్ఈ, ఈఈ, డీఈ, డీఈఈ, ఏఈఈ, ప్రాజెక్టు అధికారులు, స్థానిక సిబ్బంది మొదలగునవారు ఉన్నారు.

ఎన్నికలపై ఫిర్యాదులను యాప్‌లో చేయొచ్చు

- వీసీలో కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో అవగాహన


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

ఎన్నికల సమయంలో ప్రలోభాలు, డబ్బులు పంపిణీ ఇతరాత్ర అంశాలపై ఫిర్యాదు చేసేందుకు యాప్‌ను ఉపయోగించడంపై అవగాహన కల్పించాలని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులకు సూచించింది. వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఎస్ఎంఎస్ (ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం) యాప్ పై దక్షిణాది రాష్ట్రాల చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌లు, ఆయా జిల్లాల ఎన్నికల అధికారులకు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం అధికారి సంతోష్ ప్రతారియా గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈఎస్ఎంఎస్ యాప్ డౌన్లోడ్, లాగిన్ అయ్యే విధానం పై వివరించారు. ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే సామగ్రిని పట్టుకొని ఆ వివరాలు ఈఎస్ఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేసే విధానం, వాహనాలను తనిఖీ చేసే పద్ధతిపై జిల్లాలోని ఫ్లయింగ్ స్క్వాడ్, సర్విలెన్స్ స్టాటిస్టికల్ టీమ్ (ఎఫ్ఎస్, ఎస్ఎస్‌టీ) అధికారులకు తెలిపారు.

అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో జిల్లాలోని ఫ్లయింగ్ స్క్వాడ్, సర్విలెన్స్ స్టాటిస్టికల్ టీమ్ (ఎఫ్ఎస్, ఎస్ఎస్‌టీ)లు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వాహనాల తనిఖీలో నగదు, మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువులను టీం సభ్యులు పరిశీలించి, పట్టుకోవాలన్నారు. తనిఖీలలో మద్యం దొరికితే మద్యంను ఎక్సైజ్ అధికారులకు అప్పగించాలని సూచించారు. పట్టుబడిన నగదు వివరాలను నోడల్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. తనిఖీ బృందాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి, సిపిఓ రాజారాం, ఎల్లారెడ్డి, కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల తనిఖీ బృందాల అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మత రాజకీయాలను తిప్పికొట్టాలి

- 26న ర్యాలీని జయప్రదం చేయండి
- కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ పిలుపు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 26వ తేదీనా తలపెట్టిన బైక్, ఆటో, ట్రాక్టర్‌ల ర్యాలీని జయప్రదం చేయాలని కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఏఐటీయూసీ కార్యాలయంలో కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ మోడీ ప్రభుత్వం బడా కార్పోరేట్ కంపెనీల సేవల్లో తరిస్తూ ప్రజల, రైతుల, కార్మికుల సమస్యలను పక్కదారి పట్టించేందుకు మతోన్మాద విధానాలకు పాల్పడుతుందని ఆగ్రహ వ్యక్తం చేశారు. కేంద్రం అవలంభిస్తున్న ఈ విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలంతా ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో ఈ నెల 26వ తేదీనా తలపెట్టిన ర్యాలీని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలో 26న ఉదయం 11-30 గంటలకు ఐటిఐ నుంచి పాత కలెక్టరేట్ ధర్నా చౌక్ వరకు ట్రాక్టర్లు, బైక్లు, ఆటోలతో ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కార్మికులు ఇతర వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

బీజేపీ చేస్తున్న మత రాజకీయాలను తిప్పి కొట్టడంలో భాగంగా దేశంలోని కార్మిక వర్గం , రైతాంగం , ప్రజలందరినీ చైతన్యం చేయడం కోసం దేశంలోని అన్ని జాతీయ కార్మిక సంఘాలు, (రైతు సంఘాల ఐక్యవేదిక) సంయుక్త కిసాన్ మోర్చా, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం, అఖిల భారత కిసాన్ సభలు సంయుక్తంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక బంద్‌కు పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జిల్లాలో జరిగే పారిశ్రామిక , గ్రామీణ బంద్ విజయ వంతానికి సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎఫ్టియు ఐఎఫ్టియు, ఐ ఎన్ టి యు సి ఇతర కార్మిక సంఘాలతో రైతు, వ్యవసాయ సంఘాలు ఫిబ్రవరి 16న జరిగే పారిశ్రామిక,గ్రామీణ, బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి సుధాకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు హనుమాన్లు, ఐఎఫ్‌టీయూ నాయకులు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇటీవల అక్రమం.. ఇప్పుడు సక్రమమా?

- మొరం తరలింపుపై అధికారులను నిలదీసిన ఎంపీపీ
- ఇప్పుడు బీజేపీ ఎమ్మెల్యే తరలించనిస్తున్నాడా అంటూ ప్రశ్న

నవతెలంగాణ-మాక్లూర్



మాట్లాడుతున్న ఎంపీపీ

'అధికారులు, మొరం మాఫియా కలిసి మొరం తరలిస్తూ.. ఆ నెపాన్ని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మీదకు నెట్టారు. మొరం తరలింపు అడ్డుకున్నారు. దానిపై తాజా ఎమ్మెల్యే అర్భాటం చేశాడు. మరి ఇప్పుడు మళ్లీ నడుస్తున్న మాఫియాకు బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అండదండలు ఉన్నట్టా' అని ఎంపీపీ ప్రభాకర్ అధికారులను ప్రశ్నించారు. కాబట్టి ఇప్పటి నుంచి మొరం మాఫియాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేకపోతే అక్కడే కుర్చీ వేసుకుని కూర్చుంటానని అధికారులకు హెచ్చరించారు. మాక్లూర్ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. సర్పంచులు పదవి కాలం ముగియనుండటంతో సమావేశంలో పాల్గొన్న సర్పంచులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సిక్కి సుజాత, ఎంపీడీఓ క్రాంతి, తహశీల్దార్ షబ్బీర్, ఇరిగేషన్ డీఇ గంగారాం, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

బిల్లులు రాలేదని నేలపై కూర్చొని నిరసన

మండలంలోని మెట్ పల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ చిన్నారెడ్డి తనకు ఎన్ఆర్‌జీఎస్ నిధులు గత రెండున్నర సంవత్సరాలుగా రావడం లేదని, పనులు చేసిన పంచాయతీ రాజ్ ఏఈ బిల్లులు చేయకుండా అప్పుల పాలు చేశాడని నేలపై కూర్చొని అవేదన వ్యక్తం చేశాడు. గత ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని, తాజా ప్రభుత్వం స్పందించి నిధులను ఇప్పించాలని డిమాండ్ చేశారు. రెండున్నర సంవత్సరాల క్రితం మూడు, ఐదు రూపాయలకు వడ్డీకి తెచ్చి పనులు చేశానని, ఇప్పటికీ నిధులు రాలేదని అవేదన చెందారు. చివరకు ఎంపిపి కలుగజేసుకొని తనకు నిధులు వచ్చేలా చూస్తానని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

కోరం కోసం పడిగాపులు

అయితే మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించేందుకు కోరం కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. మండలంలో మొత్తం 14 మంది ఎంపిటిసిలు ఉన్నారు. అందులో 1/3 సభ్యులు హాజరు అయితేనే సమావేశం నిర్వహించాలి. ఈ సమావేశానికి ఎంపిటిసిలు నలుగురు మాత్రమే సమయానికి వచ్చారు. మరో వ్యక్తి 11.40 నిమిషాలకు రావడంతో సమావేశం ఏర్పాటుకు సిద్ధమయ్యారు. ఇందులో ఇద్దరు సర్పంచులు, నలుగురు ఎంపిటిసిలు, ఒక ఎంపిపితో సమావేశం ప్రారంభించారు. తొమ్మిది మంది ఎంపిటిసిలు, 28 మంది సర్పంచులు లేకుండానే సమావేశం ప్రారంభించారు. అధికారులు మాత్రం ఇద్దరు, ముగ్గురు మాత్రమే ఉన్నారు. తరువాత ఒక్కొక్కరు సమావేశం ముగిసే సమయానికి వచ్చారు. సమావేశంలో అధికారులు వచ్చిన వారు వచ్చినట్టు వారి వివరాలను ప్రజాప్రతినిధులకు వివరించారు.

స్పెషల్ ఆఫీసర్లుగా ఉన్న ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

విద్యార్థి సంఘాల వినతి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా విద్యాశాఖలో స్పెషల్ ఆఫీసర్ల పేరిట ఉన్న ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో విధులు నిర్వహించాల్సిన ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఎస్ఓ, ఎస్ జి ఎఫ్, ఏసిజిఈ, డిసిఈబి పోస్టులను డిప్యూటేషన్ ద్వారా కొత్త జిల్లా ఏర్పాటు అయినప్పుడు నియామకం చేశారని దానివల్ల పాఠశాలలో సరిగ్గా విధులు నిర్వహించకపోవడం వల్ల విద్యార్థులు తరగతులు నష్టపోతున్నారని అన్నారు. ఈ పోస్టుల్లో ప్రధానోపాధ్యాయులు ఉండడంవల్ల పాఠశాల పర్యవేక్షణ కరువైందని, అభివృద్ధికి దూరంగా ఉందని అన్నారు. రెండు పోస్టులు ఉండడం వల్ల పాఠశాలకు హాజరు కాలేకపోతున్నారని వెంటనే స్పెషల్ ఆఫీసర్ల నుండి వారిని రిలీవ్ చేసి పూర్తిగా పాఠశాల విధులు నిర్వహించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బివిఎం రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విటల్ , ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముధం అరుణ్, ఎస్ ఎస్ యు ఐ జిల్లా నాయకులు భరత్, బీడీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరేందర్ నాయకులు ఫణి, రోషన్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.


డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మద్నూర్ సొసైటీలో రూ. 5.50 కోట్ల రుణాలు బకాయి

- వసూళ్ల కోసం అధికారుల కసరత్తు.. నోటీసుల జారీ

నవతెలంగాణ-మద్నూర్


మద్నూర్ సొసైటీ

మద్నూర్ మండల కేంద్రంలో గల వ్యవసాయ ప్రాథమిక పరిపతి సంఘం సింగిల్ విండోలో దీర్ఘకాలిక రుణాల కింద ఐదున్నర కోట్ల బకాయిలు పడ్డట్లు సమాచారం. బకాయి పడ్డ రుణాల వసూళ్ల కోసం సింగిల్ విండో అధికారులు ముమ్మర కసరత్తులు చేస్తున్నారు. మొండి బకాయిల వసూళ్లకు కోసం నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ సింగిల్ విండో కార్యాలయ పరిధిలో 145 మంది రైతులు లాంగ్ టర్మ్ కింద ఎల్ టి రుణాల పేరున భూములు మార్టిగేజ్ చేయించి రుణాలు పొందినట్లు సమాచారం. తీసుకున్న రుణాలు పద్ధతి ప్రకారం కట్టలేక మొండి బకాయిల కింద ఏళ్ళు గడుస్తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారడం కొత్త ప్రభుత్వం సింగిల్ విండోలో తీసుకున్న రుణాల బకాయిలు వసూళ్లపట్ల అధికారుల తీరు తగదని ఇటీవల నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆ శాఖ మంత్రి సమీక్ష జరుపుతూ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన విషయం విధితమే. ప్రభుత్వం మారడం ఆ శాఖ మంత్రి సమీక్షలు జరపడం, బకాయి పడ్డ వసూళ్ల పట్ల అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో అధికారులు చర్యలకు దిగారు.

145 మంది వద్ద దీర్ఘకాలిక రుణాలు

ఈ విషయంపై నవతెలంగాణ మద్నూర్ మండల కేంద్రంలో గల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సింగిల్ విండో కార్యాలయాన్ని సందర్శించి దీర్ఘకాలిక రుణాల బకాయిల పట్ల సింగిల్ విండో కార్యదర్శి జే బాబురావును ఆరా తీసింది. 145 మంది దీర్ఘకాలిక రుణాల కింద ఐదున్నర కోట్ల రుపాయలు బకాయిలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మొండి బకాయిల వసూళ్ల కోసం రుణాలు తీసుకున్న రైతులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. నోటీసులు పొందిన రైతులు తమ బకాయిలు 15 రోజుల్లోగా చెల్లించవలసి ఉంటుందని ఆ తేదీలోగా చెల్లించకపోతే ప్రభుత్వ ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు మొండి బకాయిల వసుళ్ళ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.

అనాథ వృద్ధులకు అన్నదానం



నవతెలంగాణ-ఎడపల్లి

మెన్రా మండలం చింతకుంట గ్రామ శివారులో అనాథ వృద్ధాశ్రమంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా లయన్స్ మండల అధ్యక్షులు మెర్సి మాట్లాడుతూ.. వృద్ధులకు, అనాథలకు సేవలు అందించడమే తమ ఉద్దేమని అన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, అంగన్‌వాడీల్లో రాత పుస్తకాలతోపాటు పలకలు, బెంచీలు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ కోశాధికారి గంగారెడ్డి, ప్రతినిధులు పుష్పలత, మనోజ్‌కుమార్, కదం ప్రకాష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భూపతిరెడ్డికి సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని జక్రాన్ పల్లి మండలం తొర్లికొండ గ్రామానికి చెందిన వీడిసి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానం చేశారు. గ్రామ సమస్యలను ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డికి వివరించారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి బడ్జెట్ వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జక్రాన్ పల్లి మండలం కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, తెల్లన్న, రవి, జై గంగారం, వినోద్ విడిసి చైర్మన్ వెంకన్న, మహిపాల్, లింగారెడ్డి శేఖర్ గౌడ్, కుమార్, డాక్టర్ అరుణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు బొకేను అందజేస్తున్న వీడీసీ సభ్యులు

నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి పాటుపడతా

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- నాయి బ్రాహ్మణుల క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నాయి బ్రాహ్మణులకు అండగా ఉంటానని, వారి అభ్యున్నతికి పాటుపడతానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం నిజామాబాద్ నగరంలోని సుభాష్ నగర్ వద్ద గల అర్బన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అంబేద్కర్ కాలనీ నాయి బ్రాహ్మణ సేవా సంఘం తర్ఫ సంఘ సభ్యులు ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనా రాయణను మర్యాద పూర్వ కంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం నాయి బ్రాహ్మణ సేవా సంఘం (అంబేద్కర్ కాలనీ తర్ఫ) సంబంధించిన క్యాలెండర్‌ని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ ఆవిష్క రించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు సావనపల్లి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కదారి శ్రీని వాస్, కోశాధికారి హాలీవుడ్ శంకర్, ఉపాధ్యక్షులు కదారి సుధాకర్, సి.హెచ్. రాజు, క్రాంతి, ప్రణయ్, తిరుపతి, కార్యదర్శులు శంకర్,బాల్ రాజు, అశోక్, బలరాం, జగదీష్, శంబు, కదారి రవీందర్,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు లక్ష్మీరాజ్యం, గొండ స్వామి, శంకర్, గౌరవ సలహాదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని ఐసిడిఎస్ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలకు బాలికల పర్సన్ హైజి, శారీరక, మానసిక ఎదుగుదలపై సమాజంలో ఒక స్త్రీ ఎలా మెలగాలి.. అని నైపుణ్యం గురించి అంగన్వాడి టీచర్లు క్షుణంగా వివరించారు. ఆడపిల్ల చదువు ప్రాముఖ్యత, బేటి పడావో - బేటి బచావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులు, ఆరోగ్యానికి కావలసిన అలవాట్లు, సమతుల ఆహారం, విటమిన్స్, మినరల్స్, ఖనిజ లవణాలు, కార్బోహైడ్రేట్స్, మాంసకృత్తులు వల్ల ఉపయోగాలు తదితర వాటిని వివరించారు. మండలంలోని చౌట్ పల్లి, బషీరాబాద్ గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అంగన్వాడి టీచర్లు విద్యార్థినిలకు బేటి బచావో- బేటి పడావో పై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆంధ్రయ్య, భీంగల్ ప్రాజెక్ట ఐసిడిఎస్ మండల పర్యవేక్షకురాలు సరస్వతి, అంగన్వాడి టీచర్లు, ఆశాకార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి జీరో పొదుపు ఖాతా ఇస్తాం

- ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న మేనేజర్

ప్రతి విద్యార్థికి జీరో పొదుపు ఖాతా ఇస్తామని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కలిగోట్ బ్యాంక్ మేనేజర్ అన్నారు. మంగళవారం మండలంలోని చింతలూరు గ్రామంలో జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కలిగోట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత పైన మేనేజర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి జీరో పొదుపు ఖాతా ఇస్తామని తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్నులు బ్రాంచ్ మేనేజర్ కొలి ప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లచ్చన్న పాల్గొన్నారు.

లోకేష్ బాబు నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలి



కేక్ కట్ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

లోకేష్ బాబు నిండు నూరేళ్లు సంతోషంగా ఆయురారోగ్యాలతో ఉండాలని టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదా గౌడ్ అన్నారు. తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదా గౌడ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ జనరల్ సెక్రెటరీ నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఇంచార్జ్ నాగేశ్వరరావు, బీసీ సెల్ అధ్యక్షులు దంతాల ఆనంద్, బిజినెస్ సెల్ అధ్యక్షులు బొబ్బ నరసింహ రావు, మాక్లూరు మండల అధ్యక్షులు సత్య నారాయణ, శ్రీనివాస్, లక్కోర గోవర్ధన్ గౌడ్, రాములు, ఫిరోజ్, రాజేశ్వర్, పెద్ద గంగారం, కాంతా బాయ్, లక్ష్మమ్మ, రమేష్, నాగేశ్వరరావు, విష్ణు, బాలాజీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువగళం ,యువసారథి తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని నగర పార్టీ ఆధ్వర్యంలో పట్టణం లోని మానసిక,శారీరక వికలాంగుల హాస్టల్ విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కన్వీనర్ అంబిక సత్యనారాయణ కేక్ కట్ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ కో కన్వీనర్స్ బండారి గంగాధర్, కోయేడి నర్సింలు గౌడ్, సీనియర్ నాయకులు ఎండీ రఫీక్ ఖాన్,మల్లారెడ్డి, కన్వీనర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిస్కట్స్ పాకెట్స్,పండ్లు విద్యార్థులకు పంపిణీ చేశారు.

25న 'నా పోలింగ్ బూత్ నా బాధ్యత'

- ప్రతి బూత్ లెవెల్ ఏజెంట్ పాల్గొనాలి
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్



రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఈ నెల 25న నిర్వహించే నా పోలింగ్ నా బాధ్యత కార్యక్రమంలో జిల్లా బూత్ లెవెల్ ఏజెంట్లు అందరూ పాల్గొనాలి అని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఇన్చార్జి జనరల్ సెక్రెటరీ దీపికా దాస్ మున్షి ఆలోచన మేరకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్న నా పోలింగ్ బూత్-నా బాధ్యత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే హాజరవుతున్నారని తెలిపారు. హైదరాబాద్లోని ఎల్బి స్టేడియంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో విధిగా హాజరు కావాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేగా పోటీ చేసిన అభ్యర్థులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బూత్ ఏజెంట్లను పంపాలని తెలిపారు. పాసులు సిద్ధం చేస్తున్న సందర్భంగా వాటి వివరాలను కాంగ్రెస్ భవన్ కు పంపాలని మానాల మోహన్ రెడ్డి అన్నారు.

ఆడపిల్లలను బతకనివ్వాలి

- ఇప్పటికీ వివక్ష
- భారం కాదు..
- పుట్టనిద్దాం.. చదవనిద్దాం..
- నేడు జాతీయ బాలికల దినోత్సవం



నవతెలంగాణ-ఆర్మూర్

ఆడపిల్లలపై ఆది నుంచి వివక్ష కొనసాగుతూనే ఉంది. మగవాళ్లతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్న వారంటే చులకన భావనే కనబడుతున్నది. పురుషాదిక్య ప్రపంచంలో బాలికలు అంటేనే భారంగా భావిస్తుండగా రోజురోజుకు వారి సంఖ్య తగ్గిపోతుంది. ఇకనైనా ఈ దృక్పథం మారకపోతే భవిష్యత్తులో దారుణంగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల సంరక్షణ కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్న ప్రజల్లో మార్పు రావడం లేదు. నిరక్షరాస్యత, అవగాహన లోపం, పెండ్లి చేసి బరువు దించుకోవాలన్న ఉద్దేశంతో బాల్య వివాహాలు చేస్తున్నారు. ఆడపిల్లలను చదివించడంలోనే వివక్ష చూపుతున్నారు.

ఆడపిల్లలు ఉంటేనే భవిష్యత్తు...

పెళ్లయి అత్తారింట్లో అడుగు పెట్టిన అమ్మాయి భవిష్యత్తు కోసం ఎన్నో కలలు కంటుంది. అమ్మ అని పిలిపించు కోవడానికి మాతృత్వపు మమకారాన్ని ఆస్వాదించేందుకు ఆరాటపడుతుంది. గర్భం దాల్చగానే కుటుంబ సభ్యులంతా సంతోషంతో పుట్టబోయే బిడ్డ కోసం కలలు కనేవారు కానీ ఇప్పుడు పరిస్థితులు తలకిందులు అయ్యాయి. గర్భం దాల్చిన మూడు నెలలు తిరగక ముందే కడుపులో పెరిగే శిశువు ఆడ, మగ తెలుసుకోవాలని దుర్మార్గపు ఆలోచనలు చేస్తున్నారు. డబ్బుల కోసం లింగ నిర్ధారణ చేసే వైద్యుడు ఉండడంతో ఆడ శిశువును కడుపులోనే అంతం చేస్తున్నారు. కడుపులో పెరుగుతున్నది ఆడబిడ్డని తెలిస్తే చాలు చాలా మంది అబార్షన్‌పై ముగ్గు చూపుతున్నారు. బిడ్డ కోసం కలలు కన్న ఆ తల్లికి కన్నీళ్లే మిగులుతున్నాయి. మగ పిల్లాడే వంశోద్ధారకుడు అనే భావనతో చాలా కుటుంబాల్లో ఈ తంతు కొనసాగుతుంది. ఆడపిల్ల భారం అనే భావనతో కొందరు మొదటి కాన్పులో, మరికొందరు రెండో కాన్పులో అబార్షన్లు చేయించుకుంటున్నారు. దీంతో ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతుంది. ఆడపిల్లలు భారం అనుకోవడం సరికాదు మగవారితో సమాన అవకాశాలు కలిస్తే ఆడపిల్లలు అన్నింటి రాణిస్తున్నారు. ఇప్పటికీ విద్య, ఉద్యోగాల్లో ఆడవాళ్లు దూసుకుపోతున్నారు. వారసుడు మగపిల్లాడనే భ్రమలు వీడాలి. ఆడపిల్ల కూడా వారసురాలే ఆడపిల్లలు ఉంటేనే భవిష్యత్తు ఉంటుంది..

పథకాలు ఎన్ని వచ్చినా తగ్గని వివక్ష...

ఆడపిల్లల సంరక్షణ కోసం ప్రభుత్వాలు ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్న ఆడపిల్లల పైన వివక్ష మాత్రం తగ్గడం లేదు.. గత రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను తీసుకువచ్చి ఆడపిల్లల పెళ్లికి ఆర్థిక సహాయం అందించింది. ఆడపిల్లల చదువుల కోసం ప్రత్యేక పాఠశాలలు కళాశాలలను ఏర్పాటు చేసింది. ఉద్యోగాలలో 33శాతం రిజర్వేషన్లు ఉంది. ఎంతోమంది ఆడపిల్లలు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ ఆడ పిల్లల పై వివక్ష మాత్రం వీడడం లేదు. ఆడపిల్లల్ని కాపాడుకుందాం అంటూ ప్రధాని భేటీ బచావో బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆడపిల్లల పేరిట డబ్బులు పొదుపు చేయడానికి సుకన్య యోజన కార్యక్రమాన్ని చేపటారు. స్త్రీ పురుష నిష్పత్తి పెరిగిన గ్రామాలకు ప్రోత్సాహకాలు సైతం ప్రకటించారు. ఇలా ఎన్నో ప్రోత్సాహాల ద్వారా ఆడపిల్లల పట్ల సమాజంలో సానుకూలమైన మార్పు వస్తుందనుకుంటే ఆ మార్పు రావడం లేదు.

ప్రభుత్వం మారిన తర్వాత...

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం చేయడం మహిళా లోకానికి గౌరవప్రదమైనది.

తగ్గుతున్న ఆడపిల్లల సంఖ్య...

ఉమ్మడి జిల్లాల్లోని ఆడవారు అగ్ర భాగాన ఉంటే సున్నా నుండి ఆరు సంవత్సరాల వయసు గల వారిలో ఆడపిల్లల సంఖ్య భారీగా తగ్గింది. గత కొన్ని సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం వెలువరించిన నో యువర్ డిస్ట్రిక్ట్ ప్లాన్ యువర్ డిస్ట్రిక్ రిపోర్టులో జనాభా నిష్పత్తి వివరాల ప్రకారం ఆడపిల్లల సంఖ్య భారీగా తగ్గింది..

2011 జనాభా లెక్కల ప్రకారంగా జిల్లా జనాభా.. 9,72,625 కాగా అందులో పురుషులు 4,78,389 మహిళలు 4,94,236 మంది ఉన్నారు. ఇక్కడ వెయ్యి మంది మగవారికి 1033 మంది ఆడవారు ఉన్నారు.. అదే సున్నా నుండి ఆరేండ్లలోపు పిల్లల విషయానికి వస్తే వెయ్యి మంది మగ పిల్లలకు 941 మంది మాత్రమే ఆడపిల్లలు ఉన్నారు. మొత్తం జనాభాలో ఆడవారి సంఖ్య ఎక్కువగా ఉండగా పిల్లల విషయంలో తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తుంది. మొత్తం జనాభాలో ఆడవాళ్లు 15,847 మంది ఎక్కువగా ఉండగా సున్నా నుండి 6 వయసు వారిలో ఆడపిల్లలే 3390 మంది తక్కువగా ఉన్నారు. దాదాపు పదివేల మంది తగ్గిపోతున్నారన్న మాట.

ఆడపిల్ల వద్దనుకుంటే సృష్టి అంతమే..



సృష్టికి మూలం ఆడది అంటూనే ఆడపిల్ల వద్దనుకోవడం దారుణం ఆడపిల్లలేని సమాజాన్ని ఊహించుకోలేం. ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్న ఇంకా వివక్ష చూపడం అన్యాయం. రాబోయే రోజులలో ఇబ్బందులు తప్పవు. మహిళలకు రాజ్యాంగం ఎన్నో హక్కులు కల్పించింది.

డాక్టర్ యు.ఝాన్సీ రాణి, వైద్యురాలు బాలరాజు మెమోరియల్ హాస్పిటల్, ఆర్మూర్.

విజయాలు చూసైనా మారాలి..



ఆడపిల్లలు చదువులో ముందు ఉంటున్నారు.. ఏ పరీక్షల్లో నైనా ఆడపిల్లలే ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నారు. అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్నారు. ఇంకా ఆడపిల్లలపై వివక్ష చూపడం ఏంటి ఆడవాళ్లు మగవారి కన్నా ఏమి తీసిపోరు. ఆడపిల్ల అన్న చిన్న చూపు చూసే పద్ధతి మారాలి.. పాఠశాలల్లో పలు అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నాం..

వెంకట రమణమ్మ,
అంగన్వాడి సూపర్వైజర్, పిప్రి సెక్టార్, ఆర్మూర్

వడ్డెర వృత్తిదారులకు బడ్జెట్లో 3 వేల కోట్లు కేటాయించాలి

- కలెక్టర్ చేతుల మీదుగా వడ్డెర వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

వడ్డెర వృత్తిదారులకు బడ్జెట్లో 3000 కోట్లు కేటాయించాలని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాయిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు చేతుల మీదుగా వడ్డెర వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇడ్డగొట్టి సాయిలు మాట్లాడుతూ.. వడ్డెర వృత్తిదారులకు బడ్జెట్లో 3వేల కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న వడ్డెర సొసైటీలకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. వడ్డెర వృత్తిదారులకు క్వారీలపై, గుట్టలపై పూర్తి హక్కులు ఇవ్వాలని అన్నారు. క్వారీలన్నీ ప్రైవేట్ వ్యక్తుల చేతులలోకి పోయి వడ్డెర వృత్తిదారుల బతుకులు రోడ్డు మీద పడ్డాయని అన్నారు. వడ్డెర వృత్తిదారుల సొసైటి లకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు నిండిన వడ్డెర వృత్తిదారులకు పింఛన్ ఇవ్వాలని కోరారు. వడ్డెర ఫెడరేషన్ కు చైర్మన్ ను నియమించి, నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వడ్డెర వృత్తిదారులకు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అర్హులైన వడ్డెర వృత్తిదారులకు రేషన్ కార్డులు, ఇండ్లు, ఇండ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా ముఖ్య సలహాదారులు పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ బల్లష్టింగ్ చేస్తున్న సమయంలో అనేక మంది కాళ్లు, చేతులు విరిగి వికలాంగులుగా మారుతున్నారు అని అన్నారు. అనేక మంది ప్రాణాలు కోల్పోయితున్నారని అన్నారు. వృత్తి చేస్తున్న సమయంలో చనిపోతే 20 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇడ్డగొట్టి ఓడన్న, జిల్లా సహాయ కార్యదర్శులు ఎత్తరి చంద్రర్, జిల్లా ఉపాధ్యక్షులు బండారి ఎల్లయ్య, జిల్లా సోషల్ ఎత్తరి, సాయి హేందర్, జిల్లా కమిటీ సభ్యులు గోగుల ఎల్లయ్య, కంది ఎల్లయ్య, గోగుల ఎర్ర సాయిలు,ఫీట్ల. లింబయ్య, గుండె. పాపన్న సూర. నర్సయ్య, శివరాత్రి పెద్ద సాయిలు, చాటాపూర్ గంగారాం, వేముల రాజు, దండుగుల నర్సయ్య బోదాసు రాములు,బండారి ఆనంద్, పల్లపు రాజు, దండుగుల గంగారాం, మామిడి మహిపాల్, జిల్లా కోశాధికారి దేశెట్టి రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, నాయకులు

గణితమంటే జీవన విధానం

- గణితం పట్ల ఆసక్తి పెంచుకోవాలి



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గణితమంటే జీవనవిధానం- గణితం పట్ల ఆసక్తి పెంచుకుంటే అన్ని విషయాలపై పట్టు సాధించవచ్చని మేయర్ దండు నీతూ కిరణ్ అన్నారు. తెలంగాణ గణితఫోరం నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని హరిచరణ్ మార్వాడి పాఠశాలలో జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నిజామాబాద్ నగర మేయర్ నీతు కిరణ్ గణిత ప్రతిభా పరీక్ష పత్రాలను విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని సబ్జెక్ట్ లలో కన్న గణితం చాలా ముఖ్యమైన సబ్జెక్ట్ అని, మానవ జీవితంలో గణితం ముఖ్యభాగమని ప్రపంచ గణితశాస్త్ర మేధావి శ్రీనివాస రామనుజన్ స్పూర్తితో ప్రతి విద్యార్థి గణితం పట్ల శ్రద్ధ చూపాలని పిలుపు నిచ్చారు. ప్రస్తుత పోటీ కాలానికి అనుగుణంగా పిల్లలు సంసిద్ధం అయ్యేలా గణిత ప్రతిభాపరీక్ష నిర్వహిస్తున్నందుకు గణిత ఫోరం అధ్యక్షులు కాంతారావు, ప్రధానకార్యదర్శి కృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. టిఎంఎఫ్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాడ్వాయి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ గణిత ఫోరం తరపున రాష్ట్రంలోని అన్ని పాఠశాలల పిల్లలకు సులభంగా అర్థం అయ్యేలా మ్యాథ్స్ మెటీరియల్ గణిత ఉపాధ్యాయుల కోసం యూనిట్ ప్లాన్స్, లెస్సన్ ప్లాన్స్ లను అందిస్తున్నామని తెలిపారు. ఈనెల 29న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రతిభచాటాలని కోరారు. కార్యక్రమంలో టిఎంఎఫ్- జిల్లా అధ్యక్షులు కాంతారావు, ప్రధాన కార్యదర్శి టి.కృష్ణ, గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్, కార్యదర్శులు గోపాలకృష్ణ మైకేల్, ప్రధానోపాధ్యాయులు, సాంస్కృతిక కార్యదర్శులు గోపాలకృష్ణ, మైకేల్, పరమేశ్వర్, సతీష్, రాధ, శైలజ, గణిత ఉపాధ్యాయులు, మండలస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు పాల్గొన్నారు.

క్షత్రియ పాఠశాలలో ఆరోగ్య శిబిరం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ క్షత్రియ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని క్షత్రియ విద్యాసంస్థల కోశాధికారి అల్జాపూర్ గంగాధర్, సెక్రటరీ దేవేందర్ ప్రారంభించారు. డాక్టర్లు అనిల్ పడాల్ దంత వైద్య నిపుణులు, డాక్టర్ నరేష్ కంటి వైద్యనిపుణులు, డాక్టర్ చైతన్య చెవి, ముక్కు, గొంతు నిపుణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోశాధికారి అల్జాపూర్ గంగాధర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడం అంతే ముఖ్యమని అన్నారు. సెక్రటరీ అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ సీబియస్ఇ విధానాలననుసరించి ప్రతి విద్యా సంవత్సరం ఆరోగ్య శిబిర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు ఏమైనా ఆరోగ్య సమస్యలుంటే చిన్న వయస్సులోనే గుర్తించి నయం చేయవచ్చునని తెలిపారు. అంతకు ముందు పాఠశాల లో నిర్వహించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మి నరసింహస్వామి మాట్లాడుతూ భారతీయులు గర్వించదగ్గ గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ అని అన్నాడు. బ్రిటిషు వారితో పోరాడి స్వాతంత్రాన్ని సాధించాలని అందుకు మీరు నాకు రక్తాన్ని ఇవ్వండి నేను మీకు స్వాతంత్ర్యన్ని ఇస్తాను అని నేతాజీ అన్నారని తెలిపారు. ఆజాద్ హిండ్ ఫౌజ్ ను స్థాపించి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నాడని, సుభాష్ చంద్రబోస్ మరణం రహస్యంగానే మిగిలి పోయిందని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ అల్జపూర్ వీరేంద్ర,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యాసంస్థల కోశాధికారి

లోపాల పుట్ట 'నూతన విద్యా విధానం'

- సీపీఐ కార్యదర్శి సుధాకర్
- నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి
- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కొత్త విధానాల పేరుతో పాత సంస్కృతికి స్వస్తి పలుకుతున్న కేంద్ర ప్రభుత్వ తీరుని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నేటితరం విద్యార్థులకు ఉపయోగపడాల్సిన కొత్త విధానాలను అమలు చేయాల్సింది పోయి నూతన విద్యా విధానం పేరుతో అనాగరిక చర్యలను తెరపైకి తెస్తున్న కేంద్ర విద్యా విధానాన్ని ఖండిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ ఉద్ఘాటించారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రం లో రైల్వే స్టేషన్ వద్ద ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయం ముందుట జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు అంజలి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతు ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న విద్యా విధానాలు విద్యార్థులకు భవిష్యత్తును నిర్దేశించే విధంగా ఉండాలి తప్ప వాళ్ళ కాళ్ళకు సంకెళ్లుగా మారకూడదని పేర్కొన్నారు. నూతన విద్యా విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు కొనసాగుతున్న విధానానికి స్వస్తి పలికి అంతకంటే అనాగరిక విధానాన్ని విద్యార్థులకు బోధించే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న రోజుల్లో విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని నూతన విద్యా విధానాన్ని అమలు పరచాల్సి ఉండగా తాజాగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా విధానం పూర్తిగా లోప భూయిష్టంగా ఉందని ఆరోపించారు. నూతన విద్యా విధానం అంటూ విద్యార్థులను మోసం చేసే ఈ చర్యలకు కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలకాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విధానం కంటే పాత విధానమే ఎంతో మేలైనదిగా ఉందని స్పష్టం చేశారు. జాతీయ నూతన విద్యా విధానాన్ని విరమించుకోని పక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలకు విద్యార్థులందరూ శ్రీకారం చుట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. మూడోసారి అధికారంలోకి రావాలని కలలు కంటున్న ప్రధాని నరేంద్ర మోడీ ఆశలను విద్యార్థి లోకం అడ్డుకుంటుందని అన్నారు.

నూతన విద్యా విధానంతో విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం...?



సంతకాలు చేస్తున్న నాయకులు

ఏఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు భానోత్ రఘురాం

బిజెపి కుట్ర పూరితంగా నూతన విద్యా విధానం తీసు కొచ్చిందని, దీని ద్వారా విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం మారే అవకాశం వుందని, నూతన విద్యా విధానంకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐసిటియు జిల్లా కార్యదర్శి ఓమయ్య, హనుమాన్లు, ప్రజా సంఘాల నాయకులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి శివకుమార్, ప్రజా పక్షం జిల్లా స్టాపర్ నరసింహులు, ఏఐవైఎఫ్జి జిల్లా కార్యదర్శి రంజిత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు, నగర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పట్టణానికి చెందిన 15వ వార్డు చెందిన పలువురు బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జనరల్ సెక్రెటరీ జాఫర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. వారికి షబ్బీర్ అలీ కాంగ్రెస్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీ పథకాలు అమలుతో పాటు అభివృద్ధి పథంలోకి వెళ్తున్నందున బీఆర్ఎస్‌కు రాజీనామా చేసినట్లు తెలిపారు. చేరిన వారు షేక్ అప్సర్, షేక్ ఖాజామయుద్దీన్, షేక్ ఇమామ్, రసూల్ ఖాన్, సద్దాం ఖాన్, సల్మాన్ ఖాన్, తదితరులు ఉన్నారు.



షబ్బీర్ సమక్షంలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

క్రీడలు యువకులకు ఎంతో అవసరం

- సర్పంచ్ రాజ్‌కుమార్ పటేల్



నవతెలంగాణ-మద్నూర్

చదువుతోపాటు క్రీడలు యువకులకు ఎంతో అవసరమని సర్పంచ్ రాజ్‌కుమార్ పటేల్ తెలిపారు. మంగళవారం డోంగ్లి మండలంలోని మాదన్ ఇప్పర్గా గ్రామ యువకులకు సర్పంచ్ క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రికెట్ ఆటలు ఎంతో ఉత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని లొంగన్ గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలిని సర్పంచ్ నాగలగిడ్డే ఉషారాణి మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మారుమూల జుక్కల్ మండలంలో పేద విద్యార్థులకు విద్యను అందిస్తూ వారిజ్ఞాన పెంపొందిస్తున్న కృషిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రశంసపత్రాన్ని, ఉత్తమ టీచర్ అవార్డును అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, పాఠశాల హెచ్ఎం నీలిమా, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ధీరుడు.. సుభాష్ చంద్రబోస్

- ఘనంగా జయంతి వేడుకలు
- నివాళులర్పించిన పలువురు

నవతెలంగాణ-విలేకరుల బృందం

నేతాజీ సుభాష్ చంద్రబోస్ బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన గొప్ప స్వతంత్ర సమరయోధుడని.. అవిశ్రాంతంగా పోరాడిన ధీరుడని పలువురు కొనియాడారు. ఆయన జయంతి వేడుకలను ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భిక్కనూర్: పట్టణంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చంద్రబోస్ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, పట్టణ అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు లింబాద్రి, సిద్దాగౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిట్లం: మండల కేంద్రంలోని నేతాజీ సంఘం, తిమ్మానగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సమక్షంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన గొప్ప స్వతంత్ర సమరయోధుడని తెలిపారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌ను దేశాన్ని బానిస శృంఖలా నుంచి విముక్తి చేయడానికి అవిశ్రాంతంగా పోరాడిన ధీరుడని కొనియాడారు. కార్యక్రమంలో నేతాజీ యువజన సంఘం నాయకులు, ఉపాధ్యాయులు రూపసింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

సదాశివనగర్: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బొల్లిపెల్లి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భారత స్వతంత్ర సమర వీరులలో అగ్రగణ్యుడని, అలుపెరుగని పోరాటంలో ఓటమి ఎరుగని వ్యక్తిత్వంతో మాతృభూమి సేవకు తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు.

కామారెడ్డి: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు చింతల శంకర్ మాట్లాడుతూ.. నేతాజీ నేటి ఒడిస్సాలోని కటక్‌లో 1897లో జనవరి 23న జానకీనాథ్ బోస్ ప్రభావతి దేవి దంపతులకు జన్మించాడని, కలకత్తాలో విద్యాభ్యాసం చేసి 1920లో భారతీయ సివిల్ సర్వీస్ పరీక్షల్లో 4వ ర్యాంకు సాధించిన మేధావి అన్నారు. 1938లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికై తరువాత పార్టీతో ఏర్పడిన సంక్షోభం వల్ల కాంగ్రెస్ నుంచి వైదొలిగి, అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించారని తెలిపారు. అప్పటి బ్రిటిష్ నిర్ణయానికి వ్యతిరేకంగా సుభాష్ చంద్రబోస్ నిరసన ప్రదర్శన నిర్వహించారని చెప్పారు. దీంతో అప్పటి ప్రభుత్వం సుభాష్ చంద్రబోస్‌ని అరెస్టు చేయించి జైలుకు పంపించిందని తెలిపారు. దేశానికి తక్షణతరిన స్వాతంత్ర్యం సాధించాలని తపనతో భారత జాతీయ సైన్యం (ఆజాద్ హింద్ ఫౌజ్)లో చేరి, మీ రక్తాన్ని ధార పోయండి నేను మీకు స్వాతంత్ర్యం సాధించి పెడతా అని అన్నారని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి చింతల పోశవ్వ, జిల్లా మహిళ అధ్యక్షురాలు మంజుల, జిల్లా సోషల్ మీడియా ఇంఛార్జి సిరిగాద రాజేందర్, విద్యార్థి సంఘం అధ్యక్షులు అరవింద్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కాన్సెన్సీ ఇన్చార్జి శ్రావణ్ కుమార్‌గౌడ్, నాయకులు సంగౌడ్, మహేందర్, నీరడి స్వామి, రాములు, నిర్మల, రవిగౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్: మండల కేంద్రంలో గల ఎంపీపీ కార్యాలయంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజదాస్, మనోహర్‌రెడ్డి, ఎంపీడీవో రఘు, తదితరులు పాల్గొన్నారు.






భిక్కనూర్: అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు, పిట్లంలో... సదాశివనగర్‌లో... నాగిరెడ్డిపేటలో...

ఖండేభల్లూర్‌లో ఉచిత వైద్య శిబిరం



గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని ఖండేభల్లూర్‌లో సర్పంచ్ మహానంద శివరా దేశాయి ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, యువజన నాయకులు, బీఆర్ఎస్ నాయకులు శివరాజ్ దేశాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాడ్వాయి గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని గ్రంథాలయానికి కృష్ణాజివాడి పాఠశాల ఉపాధ్యాయులు గెర్యాలయు మంగళవారం రూ.5000 విలువ గల పుస్తకాలను గ్రంథాలయానికి వితరణగా అందజేశారు. విద్యార్థిని విద్యార్థులు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను, బిఆర్‌ జీ సంబంధించిన పుస్తకాలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో గ్రంథ పాలకుడు పుల్లూరి రాజలింగం, రాజు, సాయిరాంగౌడ్, విద్యార్థిని విద్యార్థులున్నారు.

లైబ్రరీ ప్రారంభోత్సవ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలో ఈ నెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్వేరోస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం (లైబ్రరీ) ప్రారంభోత్సవ కరపత్రాలను మంగళవారం స్వేరోస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కలిగోట్ సాయన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలిసారిగా స్వేరోస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సొంతంగా లైబ్రరీని నిర్మించబోవడం అభినందనీయమని అన్నారు. కావున జనవరి 26వ తేది గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్వేరోస్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం (లైబ్రరీ)ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని స్వేరోస్ ఇంటర్నేషనల్ అనుబంధ విభాగాల సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అంతేకాకుండా భవిష్యత్తు తరాల కోసం పోటీ పరీక్షల కోసం, యువకులకు అవసరమయ్యే పోటీ పరీక్షల పుస్తకాలు, ఉద్యోగ అవకాశాలు తెలిపే కరపత్రాలు, పుస్తకాలు ఈ లైబ్రరీలో అందుబాటులో ఉంటాయని, కనుక ఆయా గ్రామాల యువకులు ప్రజాప్రతినిధులు, విద్యావంతులు, సామాజిక కార్యకర్తలు ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన తెలిపారు. అనంతరం గ్రామపెద్దలు బుద్దె రాజేశ్వర్, స్వేరోస్ నాయకులు కలుసుకుని లైబ్రరీ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా అధ్యక్షులు అవినాష్, సేవ్ సొసైటీ జిల్లా అధ్యక్షులు లింబారి లక్ష్మణ్, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సింగడి సాయిలు, స్వేరోస్ ప్రతినిధులు జైపాల్, రాజు, గ్రామ అభివృద్ధి కమిటీ ప్రతినిధి సురేష్ పటేల్ పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో పూర్తిచేయాలి

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-వర్ని

పనులు నాణ్యతతో పూర్తిచేయాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని సిద్దాపూర్ వద్ద నిర్మాణంలో ఉన్న సిద్దాపూర్ రిజర్వాయర్‌ను మాజీ మంత్రి, మాజీ శాసన సభాపతి, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ పనులు షెడ్యూల్ ప్రకారం వేగవంతం.. నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, సాగునీటి శాఖ అధికారులకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వాయర్ పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ఎవరికి ఎలాంటి ఆటంకాలు కల్పించిన పనులను చేసి చూపిస్తామని అన్నారు. రైతుల కష్టం తీర్చే బాధ్యత తనదని తెలిపారు. ఆయనతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు స్థానిక రైతులు తదితరులున్నారు.

ఈపాస్ మిషన్ ద్వారా ఎరువుల అమ్మకాలు చేపట్టాలి

- వ్యవసాయ సంచాలకులు రత్న

నవతెలంగాణ-తాడ్వాయి/రామారెడ్డి

ఈపాస్ మిషన్ ద్వారా ఎరువుల అమ్మకాలు చేపట్టాలని వ్యవసాయ సంచాలకులు రత్న అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తన, పురుగు మందులు, ఫర్టిలైజర్ డీలర్లతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సహాయ వ్యవసాయ సంచాలకులు రత్న హాజరై పలు సూచనలు చేశారు. అధిక ఎరువులను వాడకుండా రైతులకు సూచనలు ఇవ్వాలని డీలర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్, మండల డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ సంచాలకులు రత్న

వెదజల్లే పద్ధతితో వరిసాగు మేలు..

రామారెడ్డి: వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేస్తే రైతులకు ఆర్థికంగా లాభదాయకమని ఎల్లారెడ్డి ఏడీఏ రత్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వెదజల్లే పద్ధతిలో వరి సాగును ఏవో హరీష్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల కేంద్రంలో దాదాపు 65ఎకరాల్లో రైతులు వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేశారని ఎకరానికి రూ.7 నుంచి 8వేల పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని, 2 నుంచి 3 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి పెరుగుతుందని కూలీల కొరత ఉండదని సూచించారు. వరిలో మొగి పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్, క్లోరంట్రా నీలి ప్రోల్ మందును పిచికారి చేయాలని రైతులకు తెలిపారు. వెదజల్లే పద్ధతిలో వరి సాగులో మెలకువలను, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక ఏఈఓ రాకేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టండి

- జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మెనూ ప్రకారం భోజనం పెట్టకుంటే ఏజెన్సీని రద్దు చేస్తామని జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల మొత్తంలో 377 మంది విద్యార్థులు ఉండగా 154 మంది విద్యార్థులు మాత్రమే మధ్యాహ్న భోజనం తినడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా వాళ్ళు టిఫిన్లు తీసుకుని వచ్చి తినడమేంటని ఆయన ఎస్ఎంసి చైర్మన్ ఏజెన్సీ నిర్వాహకులపై మండిపడ్డారు. గుడ్లు పెట్టకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడ్లు రేటు పెరగడంతో మధ్యాహ్న భోజనంలో గుడ్లు పెట్టడం లేదని ఏజెన్సీ నిర్వాహకులు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు చెట్ల కింద కూర్చోవడం భోజనం చేయలేకపోవడం మెనూ ప్రకారం భోజనం అందించలేకపోవడం వంటివి రిపీట్ కాకూడదన్నారు. విద్యార్థులందరూ పాఠశాలలో భోజనం చేసే విధంగా భోజనం వండాలని ఆయన ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. రెండు మూడు రోజుల్లో తిరిగి మళ్లీ మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తానని ఆయన అన్నారు. ఎస్ఎంసి చైర్మన్ కిష్టయ్య, ప్రిన్సిపల్ శ్రీలత ఉన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జెడ్పీటీసీ

సర్పంచ్‌ల పదవీ కాలాన్ని పెంచాలి

- సర్పంచ్‌ల ఫోరం జాయింట్ సెక్రెటరీ మహేందర్‌రెడ్డి



వినతిపత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్‌ల ఫోరం

నవతెలంగాణ-రామారెడ్డి

సర్పంచ్‌ల పదవీ కాలాన్ని పెంచాలని సర్పంచ్‌ల ఫోరం జాయింట్ సెక్రెటరీ మహేందర్ రెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీలకు రావలసిన నిధులను వెంటనే మంజూరు చేయాలని అన్నారు. రాష్ట్ర నిధులు 18 నెలల నిధులను వెంటనే మంజూరు చేసి గ్రామపంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. మంగళవారం పంచాయతీ రాజ్ ఫైనాన్స్ కమిషనర్ స్మిత సబర్వాల్‌కు సెక్రటేరియట్‌లో సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు.

ఉపాధి హామీ చెల్లింపుల జాప్యంపై విచారణ



మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-పిట్లం

ఉపాధి హామీ చెల్లింపుల జాప్యంపై జిల్లా డీఆర్‌డీఓ అంబుడ్స్‌మెన్ మెహ అనీష్ దర్యాప్తు చేపట్టారు. మంగళవారం స్థానిక పోస్టల్ శాఖను ఎంపీడీవో వెంకటేశ్వర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12న మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మండల సామాజిక తనిఖీలో వచ్చిన ఉపాధి హామీ కూలీల డబ్బులు చెల్లింపులో ఫిర్యాదులు రావడంతో జిల్లా డీఆర్‌డీఓ పిడి సాయన్న ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. స్థానిక పోస్టల్ శాఖ ఎస్‌పిఎం లింగంతో నిర్వహించిన విచారణలో పోస్టల్ శాఖ ద్వారా ఉపాధి హామీ డబ్బుల చెల్లింపులకు గాను గతంలో ఫినాకిల్ యాప్ ద్వారా కూలీలకు డబ్బులు చెల్లించడం జరిగింది. ప్రస్తుత పరిస్థితులలో ఆ యాప్ తొలగించడం మూలాన ఇబ్బందులు తలెత్తున్నాయని తెలిపారు. డబ్బుల చెల్లింపులకు గాను పోస్టల్ శాఖ విత్ డ్రా ఓచర్ ద్వారా ఉపాధి కూలీలకు పేమెంట్ చెల్లించక వచ్చునని, రోజువారీగా ఒక గ్రామానికి చెల్లించడం సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి శివకుమార్, పంచాయతీ సెక్రటరీ యాదగిరి పాల్గొన్నారు.

బడాపహాడ్‌లో భక్తులకు అన్నదానం

- నేటితో ముగియనున్న ఉత్సవాలు



వంటలు చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-వర్ని

మండలంలోని బడాపహాడ్ ఉర్సు ఉత్సవాలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రెండవ రోజు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కవ్వలి పాటలతో అలరించారు. భక్తుల కోసం మూడు రోజులు అన్ని విధాల వసతులు కల్పించినట్లు వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ సద్దాం తెలిపారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు డిప్యూటీ సూపరింటెండెంట్ జమల్, జూనియర్ అసిస్టెంట్ అఖిల్ పాషా, తహశీల్దార్ నారాయణ, పోలీస్ అధికారులు సాయన్న తదితరులున్నారు.

షబ్బీర్ అలీకి శుభాకాంక్షలు తెలిపిన రాజంపేట్ మండల నాయకులు



షబ్బీర్ అలీని కలిసిన నాయకులు

నవతెలంగాణ-రాజంపేట్

మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రభుత్వ సలహాదారునిగా నియమించడంతో రాజంపేట్ మండల అధ్యక్షుడు యాదవరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మహమ్మద్ షబ్బీర్ అలీని హైదరాబాద్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు యాదవరెడ్డి, కె.వీరన్న కిసాన్ సెల్ మండలాధ్యక్షులు జూకంటి సుధాకర్‌రెడ్డి, యూత్ మండలాధ్యక్షులు కృష్ణారావు, సొసైటీ డైరెక్టర్ వాజిద్ అలీ, శివాయిపల్లి గ్రామ అధ్యక్షులు ఆనంద్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రామారావు, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు జమీల్ పాల్గొన్నారు.

సీఎం సలహాదారులను కలిసిన నారెడ్డి మోహన్‌రెడ్డి



నవతెలంగాణ-రామారెడ్డి

సీఎం సలహాదారుడు నరేందర్‌రెడ్డిని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి మంగళవారం కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. అనుభవాన్ని గుర్తించి కాంగ్రెస్ అధిష్టానం ముఖ్యమంత్రి సలహాదారులు నియమించడం శుభ పరిణామమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంచి సూచనలు ఇస్తూ తెలంగాణ అభివృద్ధిలో తన వంతు కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని నరేందర్‌రెడ్డిని నియమించినందుకు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే, సోనియా గాంధీ, రాహుల్‌గాంధీతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ఓటర్ జాబితాలో తప్పులేకుండా చూడాలి

- తహసీల్దార్ ముజీబ్



మాట్లాడుతున్న తహసీల్దార్ ముజీబ్

నవతెలంగాణ-మద్నూర్

ఓటర్ జాబితాలో తప్పులను జాగ్రత్తగా సవరించాలని అధికారులకు తహసీల్దార్ ఎండి ముజీబ్ సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులకు ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో సీనియర్ అసిస్టెంట్ ఎలక్షన్ విజయ ఓటర్ల జాబితా సవరణపై తెలియజేశారు. నాయబ్ తహసీల్దార్ శంకర్, ఎలక్షన్ సూపర్‌వైజర్ ముస్తఫా, జూనియర్ అసిస్టెంట్ బాలరాజు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

గోవూర్ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆటల పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సన్నేసాబ్

నవతెలంగాణ-వర్ని(మోస్రా)

మండలంలోని గోవూర్ హైస్కూల్లో విద్యార్థులకు ఆటల పోటీలను పాఠశాల చైర్మన్ సన్నేసాబ్ మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులకు చదువుతోపాటు శారీరక దృఢత్వం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలంటే విద్యా దశ నుంచి ఆటలు ప్రారంభించాలన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
నిజామాబాద్
బుధవారం జనవరి 24, 2024 www.navatelangana.com

ఒంటరి మహిళలు, సీనియర్ సిటిజన్లే టార్గెట్

- బంగారం చోరీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/బాల్కొండ

ఒంటరి మహిళలను సీనియర్ సిటిజెన్లను టార్గెట్ చేస్తూ ఓ వ్యక్తి బంగారం దొంగిలిస్తూ పారిపోతున్నాడని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జక్రాన్‌పల్లి పోలీసులు, బాల్కొండ ఎస్సై కే. గోపి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్తాఫ్ హైదరాబాద్ నివాసి కాగా బట్టతలకు క్యాప్ పెట్టుకుని, కుడి కాలుతో కుంటినట్లు నడుస్తూ నల్ల పల్సర్ బండి ఉపయోగిస్తున్నాడని పేర్కొన్నారు. ఒంటరి మహిళలు, సీనియర్ సిటిజన్లను టార్గెట్ చేసి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దొంగిలించి పారిపోతున్నాడని పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాదులో దొంగతనం చేశాడని, పక్క మండలాల్లో దొంగతనం చేసినట్టు సమాచారం వచ్చిందని తెలిపారు. ఎవరికైనా ఈ ఫోటోలో ఉన్న వ్యక్తి కనిపిస్తే 100 నెంబర్‌కు కాల్‌చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎవరైనా ఈ వ్యక్తి గురించి సమాచారం తెలిస్తే 8712659860 నెంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

నూతన భవన ప్రారంభోత్సవం



నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ గ్రామీణ బ్యాంకు రెంజర్ల శాఖ నూతన భవన ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా హాజరై వై.శోభ భవన కార్యాలయంను మంగళవారం ప్రారంభించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను ప్రజలకు, ఖాతాదారులకు వివరించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల రాజేశ్వర్, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ రామారావు, ఉప సర్పంచ్ మోహన్ రెడ్డి, ఏపీఎం ప్రసాద్ రావు, గ్రామీణ బ్యాంకు మేనేజర్ హన్మాండ్లు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డకు వరం కల్యాణ లక్ష్మి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పేదింటి ఆడబిడ్డకు వరం కల్యాణ లక్ష్మి అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కల్యాణలక్ష్మి పథకం పెళ్లి చేసిన ఆడబిడ్డ కుటుంబానికి భారం కాకుండా ఆర్థిక సహాయం కింద లక్ష నూటపదహారు రూపాయల విలువ గల చెక్కులను నగరంలో 69 మంది లబ్దిదారులకు అందించామని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉప అధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు స్రవంతి రెడ్డి, న్యాలం రాజు, ప్రవళిక, మమత-ప్రభాకర్, సుధీర్ ,వినోద్, మాస్టర్ శంకర్, వెల్డింగ్ నారాయణ, నార్త్, సౌత్ మండలాల ఎమ్మార్వోలు, ఆర్ఐలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోపాల్: మండలంలోని పలుగ్రామాలకు చెందిన (51)మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ, చాలామంది ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు సంక్షేమ పథకాలు అందవని అన్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు నిరుపేదలందరికీ అందిస్తామని, ఇంతకు ముందు ప్రభుత్వంలో బిజెపి పార్టీ నాయకులకు గాని కాంగ్రెస్ పార్టీ నాయకులకు సంబంధించిన వారికి కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు విషయంలో చాలా ఇబ్బందులు పెట్టేవారని అన్నారు. పార్టీలకతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని, అలాగే ఆరు గ్యారెంటీ పథకాలను కూడా ప్రతి నిరుపేదకు అందే విధంగా చూస్తానని ఆయన తెలిపారు. ఇంతకుముందు ప్రభుత్వం ఎక్కడ చూసినా అవినీతిమయమైందని కాళేశ్వరం ప్రాజెక్టు, అలాగే ప్రతి శాఖలో కూడా అప్పుల కుప్పలుగా చేశారని అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత బంగారు తెలంగాణ ఉంటే గత తొమ్మిదిన్నర సంవత్సరాలకు దాదాపు 5 లక్షల కోట్ల అప్పుల పాలయ్యామని తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో మొత్తం అప్పులపాలు చేసి ప్రజలను మోసం చేసి మభ్యపెట్టిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతానని, నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉందని, అతి త్వరలో రోడ్లకు మహర్దశ రాబోతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మోపాల్ మండల అధ్యక్షుడు సాయి రెడ్డి, శేఖర్ గౌడ్, నవీన్ రెడ్డి, తాహాసిల్దార్ కాజా కుతుబుద్దీన్, ఆర్ ఐ రాజేశ్వరరావు, నాయకులు సురేష్ నాయక్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు

నిజామాబాద్ రూరల్: నిజామాబాదు రూరల్ మండల నియోజకవర్గ ఎమ్మెల్యే భూపతిరెడ్డి చేతుల మీదుగా కల్యాణ లక్ష్మి చెక్కులను మల్లారం గ్రామానికి చెందిన ఆరుగురు లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నిజామాబాదు జిల్లా డీసీసీ డెలికేట్ మెంబెర్ జవాజీ రమేష్, నిజామాబాదు రూరల్ మండలం కిసాన్ మోర్చా అధ్యక్షుడు పోల శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పిట్ల నెహ్రూ, మండల ఉపాధ్యక్షులు కొండా శ్రీనివాస్, మాజీ సింగల్ విండో చైర్మన్ బొల్లం రాజన్న, నిజామాబాద్ మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఇటుకల నాని(నవీన్), పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిజామాబాద్‌సిటీ : చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే



మోపాల్‌లో..



డిచ్‌పల్లి : చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఆడిబిడ్డలు బరువు కావద్దనేదే ప్రభుత్వ ఉద్దేశం

డిచ్‌పల్లి: తల్లిదండ్రులకు ఆడిబిడ్డలు బరువు కావద్దనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మీ, షాది ముభారక్ చెక్కులను అందజేస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం కార్యాలయం లో డిచ్ పల్లి, ఇందల్ వాయి మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి మాట్లాడుతూ.. రాబోవు రోజుల్లో గ్రామాల్లో నెలకోని ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అమృతపూర్ గంగాధర్, మోత్కురి నవీన్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంతోష్ రెడ్డి, పోలసాని శ్రీనివాస్, తిర్మన్ పల్లి మాజీ ఎంపిటిసి చింతల కిషన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హబీబ్, మోహ్సిన్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించి సహకరించాలి

- ఎంవిఐ వెంకటస్వామి

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రతి ఒక్క వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సహకరించాలని పట్టణ ఎంవిఐ వెంకటస్వామి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలలో భాగంగా మంగళవారం పట్టణ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీఓ వినోద్ కుమార్‌తో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాహనదారులు ఎల్లవేళలా తమ ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని, హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు వేసుకోవాలని సూచించారు. మన కుటుంబానికి మనమే పెద్ద కాబట్టి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని ఆర్డీవో అన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య చైతన్య వేదిక క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

ఆరోగ్య చైతన్య వేదిక క్యాలెండర్‌ను మంగళవారం మండలంలోని గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ మానస చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆరోగ్య చైతన్య వేదిక డివిజన్ కన్వీనర్ జక్కుల మోహన్ మాట్లాడుతూ ఆరోగ్య చైతన్య వేదిక అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్యార్థులకు, ప్రజలకు కలుషితం కాని పోషకాహారం సురక్షితమైన నీరు స్వచ్ఛమైన గాలి కల్తీ లేని ఆహారం ఆడపిల్లల సంరక్షణ వంటి వాటి గురించి అవగాహన కల్పించడమే ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ యాస్మిన్ సూపర్వైజర్ రవి స్టాఫ్ నర్స్ కల్పన, ఫార్మసిస్ట్ లక్ష్మణ్, ఎంఎల్‌హెచ్‌పి జానీ ఆరోగ్య కార్యకర్తలు, ఎస్తేరు రాణి, సుల్తానా, విజయ తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్‌డే వేడుకలకు మత్స్యకారుల ప్రతినిధులకు ఆహ్వానం

నవతెలంగాణ-ఆర్మూర్

డిల్లీ లో జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు తెలంగాణ రాష్ట్రం నుండి ఉత్తమ మత్స్యకారులకు ప్రధాన మంత్రి ఆహ్వానం అందుకున్నట్లు జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మాజీ అధ్యక్షులు బింగి పెంటయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ప్రతి రాష్ట్రం నుండి ఉత్తమ మత్స్యకార కుటుంబాలను డిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు ఆహ్వానించాలని సెంట్రల్ ఫిషరీస్ బోర్డ్‌ను ఆదేశించారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి ఐదుగురు ఉత్తమ మత్స్యకారులను వారి కుటుంబాలను సెంట్రల్ ఫిషరీష్ బోర్డ్ ఆహ్వానం పలికిందని తెలిపారు. ఈ జాబితాలో రాష్ట్రంలోని జిల్లాకు చెందిన సెంట్రల్ ఫిషరీష్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నేషనల్ ప్రెసిడెంట్ పంపరి జనార్ధన్, అక్కపల్లి ఉదయ్ కిరణ్, వంగల రాజు, కాపర్తి మోహన కృష్ణ, వీరి కుటుంబాలతో సహా డిల్లీ జరిగే రిపబ్లిక్ డే వేడుకలో పాల్గొనాలని ఆహ్వానించనట్టు ఆయన తెలిపారు.

బాధితురాలికి ఎల్వోసీ అందజేత

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రానికి చెందిన సేని లక్ష్మీ భర్త నర్సయ్య మెదడు సంబంధిత వ్యాధితో భాధపడుతు నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2 లక్షల రూపాయల ఎల్వోసీని మంజూరు చేయించారు. ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి వ్యక్తిగత సహాయకులు నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి మంజూరు కాపీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు సునీల్ కుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్‌కు మండల అధ్యక్షుని రాజీనామా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడుగా ఉన్న చింత శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీకి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంటు తారక రామరావు, జిల్లా అధ్యక్షులు అశన్నగారి జీవన్ రెడ్డి, నిజామాబాద్ రూలర్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు రాజీనామా పత్రాన్ని పంపించినట్లు వివరించారు. ప్రస్తుతం బిఆర్ఎస్ డిచ్ పల్లి మండల పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నానని, వ్యక్తి గత కారణాల వలన మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవికి, పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. ఈ రాజీనామను ఆమోదింపవలసిందిగా లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం మెంట్రాజ్ పల్లి సహకార సొసైటీ చైర్మన్ గా కొనసాగుతున్నారు. గత కొన్నేళ్లుగా పార్టీ లో ఉంటు రాజీనామా చేయడంతో పార్టీ కి షాక్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

పూర్వ విద్యార్థి దాతృత్వం..

- చదువుకున్న పాఠశాలకు రూ.20వేల విరాళం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



టై, బెల్టులు అందజేసిన బాబురావు

డిచ్ పల్లి మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి డి.బాబురావు ప్రస్తుతం పంచాయతీ రాజ్ శాఖ డిప్యూటీ ఇంజినీర్ తనవంతుగా ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ సందర్భంగా టై, బెల్టులు కొనుగోలు నిమిత్తం ఇరవై వేల రూపాయలు విరాళంగా మంగళవారం ప్రధానోపాధ్యాయునికి అందజేశారు. పూర్వ విద్యార్థి దాతృత్వానికి ప్రధానోపాధ్యాయులు, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి బి.సీతయ్య ఉపాధ్యాయ బృందం ధన్యవాదాలు తెలిపారు.

ఏర్గట్ల పిఏసీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు, సిబ్బంది

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలో మంగళవారం పిఏసీఎస్ అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య అధ్యక్షతన సంఘ వార్షిక క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిఏసీఎస్ అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య మాట్లాడుతూ... రైతులకు సకాలంలో ఎరువులను, విత్తనాలను అందించడమే సంఘ ధ్యేయం అని,రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సంఘ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో సంఘ వైస్ చైర్మన్ సిగసారం గంగారాం, డైరెక్టర్లు బద్దం ప్రభాకర్, కొలిప్యాక శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం పెద్ద గంగారాం, జుంగల పెద్ద గంగారాం, రేండ్ల రాజారెడ్డి, భూదేవి, సాయమ్మ గంగాధర్, కిషన్, గున్నవ్వ, సంఘ కార్యదర్శి జక్కని శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగులకు మోటార్ సైకిళ్ల పంపిణీ

- అంగన్‌వాడీ టీచర్లకు డ్యూటీ చీరల పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గానికి చెందిన ఆరుగురు వికలాంగులకు మోటార్ సైకిళ్లను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అందజేశారు. నాలుగురికి రెట్రో ఫిట్టేడ్ మోటరైజ్డ్ వాహనాలు, ఇద్దరికీ బ్యాటరీ ఆపరేటర్ వీల్ చైర్లు అందజేశారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపి ప్రశాంత్ రెడ్డి మాట్లాడారు. బాల్కొండ నియోజకవర్గంలో ఇంకా అనేక మంది అర్హులైన వికలాంగులు ఉన్నారని, వారందరికీ వాహనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. ఇందుకోసం మంత్రిని కలిసి విన్నవించనున్నట్లు ప్రశాంత్ రెడ్డి తెలిపారు. వాహనాలు తీసుకున్న లబ్దిదారులు వాటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అంగన్ వాడి టీచర్లకు, హెల్పర్లకు డ్యూటీ చీరలు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని భీంగల్ ప్రాజెక్ట్‌లో 47 మినీ అంగన్వాడి టీచర్లను మెయిన్ టీచర్లుగా గుర్తించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షురాలు బీమా జమున, ఉపేందర్, వైస్ ఎంపిపి సురేష్, జిల్లా ఆర్టిఓ మెంబర్ రాములు, సామ మహిపాల్, తహసిల్దార్ నాగేశ్వరరావు, ఎంపిడిఓ కరుణాకర్, భీంగల్ ఐసిడిఎస్ సీడీపీఓ సుధారాణి, ఏసీడీపీఓ జ్ఞానేశ్వరి, కోఆర్డినేటర్ విజయలక్ష్మి, బాల్కొండ నియోజకవర్గము డిసేబుల్ వింగ్ కిరణ్, అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే వేముల దంపతులు

కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లి గ్రామశివారులోని శ్రీ కోటిలింగేశ్వర స్వామిని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మంగళవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శాసనసభ ఎన్నికలకు ముందు శ్రీ పత్యంగిరా మాత త్రిశూలమునకు కట్టిన ముడుపులు విప్పి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీ ప్రత్యంగిరా మహా యాగం, పూర్ణహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రశాంత్ రెడ్డి దంపతులకు ఆలయ నిర్మాణ ధర్మకర్తలు గంగా ప్రసాద్ దీక్షితులు ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు.

పలువురు ఆత్మీయులను పరామర్శించిన ఎమ్మెల్యే

బాల్కొండ: ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మండల పరిధిలో మంగళవారం పర్యటించి పలువురు ఆత్మీయుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. తోపారం గంగాధర్ మండల కార్యవర్గ సభ్యుడు రోడ్డు ప్రమాదం జరుగగా కూతురు కాలు విరిగింది, గంగాధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వేంపల్లి చిన్న బాల్ రాజేశ్వర్ వేల్పూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అత్త కాలం చేయడంతో వారి కుటుంబాన్ని, నల్ల తిరుపతి ఎస్సి విభాగం గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు తండ్రి ప్రమాదంలో కాలువిరగడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు కన్న పోశెట్టి కాలు విరగడంతో వారిని, ఇత్వార్ పేట్ గ్రామంలో సంతకుల జువ్వన్న ఇత్వార్ పేట్, ఎస్టీ విభాగం మండల అధ్యక్షుడు అనారోగ్యంతో బాధపడుతుండటంతో వారిని, ఎస్సి విభాగం గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దొన్కంటి రాజేశ్వర్ కుమారుడు ప్రమాదంలో కాలు విరిగడంతో వారిని పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు.

కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్,సీనియర్ నాయకులు వై. లింగాగౌడ్, తౌటు గంగాధర్, భూస నరహరి, సయ్యద్ ఇఫ్తేఖరుద్దీన్,సయ్యద్ మజారుద్దీన్ ఏ .శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వికలాంగులకు స్కూటీలు అందజేస్తున్న ఎమ్మెల్యే



మొక్కులు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

- కేవీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు
- నిజామాబాద్ కేవీలో పరాక్రమ దివస్ సందర్భంగా చిత్రలేఖన పోటీలు



ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

విద్యార్థులు చదువుతోపాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని, అప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని కేంద్రీయ విద్యాలయ నిజామాబాద్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి-పరాక్రమ్ దివస్‌లో భాగంగా, పరీక్షా పే చర్చా-2024పై ఇంటర్ స్కూల్ చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కేంద్రంలోని వివిధ పాఠశాలలకు చెందిన 9-12వ తరగతి విద్యార్థులు సుమారు వంద మందికిపైగా పాల్గొన్నారు. చిత్రాలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు చిత్రలేఖన సామాగ్రి పంపిణీ చేశారు. విజేతలుగా నిలిచిన పి. సుమిష (9వ తరగతి-జడ్‌పీహెచ్‌ఎస్-బోర్గం) మొదటి స్థానం, డీ. పర్ణిక (10వ తరగతి కేంద్రీయ విద్యాలయ బోధన్) రెండవ స్థానం, జీ. ఇందు (10వ తరగతి-జడ్పీహెచ్ఎస్-బోర్గం) మూడవ స్థానం, మనోజ్ (10వ తరగతి ఏహెచ్‌పీపాఠశాల) నాల్గవ స్థానం, మధు ప్రియ (9వ తరగతి-జడ్‌పీహెచ్‌ఎస్ బోర్గం) 5వ స్థానం కేంద్రీయ విద్యాలయ నిజామాబాద్ ప్రిన్సిపాల్ బి. వెంకటేశ్వరరావు ప్రశంసా పత్రం, ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాలు ప్రదానం చేసి అభినందించారు.

నాట్యంలో నంది అవార్డు



నందిఅవార్డు అందుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని విజ్ఞాన జ్యోతి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినిలు నాట్యంలో నంది అవార్డును గెలుపొందారు. మంగళవారం హైదరాబాదులోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రిపబ్లిక్ డే ఉత్సవాలలో భాగంగా నాట్య పోటీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ పరమేశ్వర నిత్య కళానిలయం నాట్య గురువు శిరీష రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో కూచిపూడి నాట్యంలో శిక్షణ పొందిన విద్యార్థినుల భవ్య శ్రీ, శాలిని గౌడ్, శ్రీహిత గౌడ్, నిహస్వి గౌడ్, నమ్రత, మనస్విని, సాహితి, మిథిలాదేవి, సుదీక్ష, భువనేశ్వరి, శివాని, బి. మనస్విని నాట్య పోటీల్లో పాల్గొని నంది అవార్డును గెలుపొందారు. నాట్య గురువు శిరీష రాజశేఖర్ గౌడ్ ను నాట్య పోటీల నిర్వాహకులు నటరాజ పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా నాట్య గురువు శిరీష మాట్లాడుతూ విద్యార్థినులకు నాట్యంలో శిక్షణ ఇప్పించిన, వారిని తీర్చిదిద్దేందుకు సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిన్నారులు భవిష్యత్తులో నృత్య కళాకారులుగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కాగా నాట్య పోటీలో నంది అవార్డు గెలుచుకున్న విద్యార్థినులను, నాట్య గురువు శిరీషను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

తండాకు బస్సు సౌకర్యం

- ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపిన తండావాసులు

నవతెలంగాణ-ధర్పల్లి

నిజామాబాద్ నుండి డిబి తండా మీదుగా దుబ్బాక వరకు బస్సు సౌకర్యం కల్పించినందుకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి తండాకు చెందిన సోదరులు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం డిబి తండా పెద్దలు, సర్పంచ్ నరేందర్‌తో కలిసి బస్సు సౌకర్యంకోసం విన్నవించగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి తండావాసులు బస్సు సౌకర్యం కల్పించారు. ప్రతి రోజు నిజామాబాద్ డిపోకు చెందిన బస్సు చేంగల్ వరకు నడిచేదని తమ తండావాసులు నిజామాబాద్ వెళ్లాలంటే, బస్సు కొరకు చేంగల్‌ఐన వెళ్ళాలి లేదా దుబ్బాకకు ఐన వెళ్లి అక్కడినుండి నిజామాబాద్ వెళ్ళవలసి వస్తుందని, మహిళలకు, విద్యార్థులకు అనేక ఇబ్బందులు కలిగేవని, ఎమ్మెల్యే సహకారంతో మూడు తండాల వారికీ ఇబ్బందులు తొలగాయని హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతి రోజు ఇకనుండి చేంగల్ మీదుగా డిబి తండా, దుబ్బాక వరకు రెండు పూటలు బస్సు కొనసాగుతుందని తండావాసులు తెలిపారు.



తండాకు వచ్చిన బస్సు

పురిగిరి క్షత్రియ పెరిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

- అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ చేతుల మీదుగా..

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి


నిజామాబాద్ జిల్లా పురిగిరి క్షత్రియ పెఱిక సంఘం 2024 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, పెద్దల ఆధ్వర్యంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ చేతుల మీదుగా ఆయన స్వగృహం నిజామాబద్‌లో ఆవిష్కరించినట్టు పెరిక మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్రాన్‌పల్లి మాజీ ఎంపీపీ మైదం రాజన్న తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బోడకుంటి సుధాకర్ ఎమ్మెల్యేకు నిజామాబాద్ జిల్లా పెరిక సంఘం భవనం అసంపూర్తిగా ఉన్నందున నిధులు ఇచ్చి పూర్తి చేసే విధంగా సహాయం చేయాలనీ విజ్ఞప్తి చేయగా సానుకూలం వ్యక్తం చేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పెరిక సంఘం ప్రధాన కార్యదర్శి బుద్దె.రాజేశ్వర్, ఆర్థిక కార్యదర్శి ఊట్ల.శంకర్, అసోసియేట్ అధ్యక్షులు బుద్దె.సుదర్శన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బోడకుంటి.పోశెట్టి, వ్యవస్థాపకులు పిన్నేం.శంకర్, సందెల.రామచంద్రం, పూజారి. తులసి, బి. రామచంద్రం,పెఱిక మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మైదం. రాజన్న, జిల్లా పెద్దలు లక్కర్స్ వేణు, ఎన్‌సీసీ శంకర్, మామిడిపల్లి గంగాధర్, కానుగంటి రంజిత్, బోడకుంటి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, తదితరులు

ఉత్తమ ఫలితాన్ని సాధించి పాఠశాలకు పేరు తేవాలి

- రోటరీ క్లబ్ అధ్యక్షులు గోపికృష్ణ పట్వారి



బూట్లు అందజేస్తున్న గోపీకృష్ణ పట్వారి

నవతెలంగాణ-ఆర్మూర్

పదవ తరగతిలో ఉత్తమ ఫలితాన్ని సాధించి పాఠశాలకు పేరు తేవాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు గోపికృష్ణ పట్వారి అన్నారు. ఆలూరు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ అధ్యక్షులు ఎం.కె నరేందర్ సహకారంతో వారికి బూట్లు (60 జతలు 15వేలు) వితరణ చేశారు.. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ మా వంతు సేవలు ఎల్లప్పుడూ ఉంటాయని, పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాన్ని సాధించి పాఠశాలకు పేరు తేవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నరేందర్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ వారి సేవ స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ సందర్భంగా రోటరీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి పట్వారీ తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ, రోటరీ మాజీ అధ్యక్షులు ప్రవీణ్ పవార్, సభ్యులు రాస ఆనంద్, శశిధర్, రాంప్రభూ అశ్విక్, అధ్యాపకులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో విద్యుత్ ఆపరేటర్ మృతి



నవతెలంగాణ-లింగంపేట్

గుండెపోటుతో విద్యుత్ ఆపరేటర్ మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. లింగంపేట్ గ్రామానికి చెందిన గొంగళ్ల నరసింహులు (40) గత కొన్ని సంవత్సరాలుగా మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం విధులు నిర్వహించి మంగళవారం ఇంటి వద్దనే ఉన్నాడు. తలనొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పాడు. కొద్దిసేపు నిద్రపోతానని భార్య, తల్లితో చెప్పి.. నిద్రపోయాడు. కుటుంబ సభ్యులు నిద్రలో నుంచి లేపేసరికి శ్వాస లేకపోవడంతో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతిచెందినట్టు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. నరసింహులుకు భార్య లక్ష్మి, ఇద్దరు కూతుర్లు, కుమారుడు, తల్లి ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృత్యువాత

నవతెలంగాణ-గాంధారి

విద్యుత్ షాక్‌తో గేదె మృత్యువాతపడింది. మండల కేంద్రానికి చెందిన పత్తి నారాయణకు చెందిన గేదె గ్రామపంచాయతీ బోరుబావి వద్ద విద్యుత్ షాక్ రావడంతో మృత్యువాతపడింది. గేదె మృతితో సుమారు రూ.80,000 నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. తమ కుటుంబాన్ని ఆదుకోవాలని అధికారులను కోరారు.



మృత్యువాతపడిన గేదె

నేతాజీ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

- నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా నివాళి

నవతెలంగాణ-విలేకరుల బృందం

కంఠేశ్వర్ : నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి అయిన జనవరి 23ని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి రాజు గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి సందర్భంగా నిజామాబాద్ నగరంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల ముందు ఎన్నికల ప్రచారంలో భాగంగా నేటి ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే వెంటనే నేతాజీ జయంతిని అధికారిక లాంచనాలతో నిర్వహించడంతోపాటు, జాతీయ సెలవు దినంగా ప్రకటిస్తామని, అంతేకాకుండా ఆయన మరణానికి సంబంధించిన రహస్య ఫైళ్లను బయటకు తీసుకొస్తామని, ఆయన చేసిన పోరాటాన్ని నేటి యువతకు తెలిసేలా పాఠ్యపుస్తకాల్లో చరిత్ర పొందుపరుస్తామని హామీ ఇచ్చారన్నారు. పదేళ్ల గడిచిపోతున్నా ఏ ఒక్క హామీని కూడా దేశ ప్రధాని నిలబెట్టుకోకపోవడం శోచనీయమని ఆయన అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ పట్ల నేటి యువతకు, ప్రజలకు ఏమాత్రం గౌరవం తగ్గలేదని ప్రభుత్వాలు స్పందించకున్నా యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు నేటికీ ఆయన త్యాగాన్ని గుర్తుపెట్టుకొని ఆయన జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నాయని కొనియాడారు. ఇప్పటికైనా కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలు నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన త్యాగాన్ని గుర్తించి ఆయన జయంతి అయిన జనవరి 23న జాతీయ సెలవు దినంగా ప్రకటించడంతోపాటు అధికారికంగా ఆయన జయంతి ఉత్సవాలను జరపాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, ఆనంద్, నగేష్, నాగరాజు, రాకేష్ యాదవ్ రాజన్న ,విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు జవారి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సుభాష్ నగర్ హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ చామకూర ప్రభాకర్ రెడ్డి నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలతో నివాళులు అర్పిచారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రెసిడెంట్ చామకూర ప్రభాకర్ రెడ్డి



కంఠేశ్వర్ : హౌసింగ్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో..

మాట్లాడుతూ.. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర్య పోరాటం చేసిన యోధుడని అన్నారు. నాకు రక్తం ఇవ్వండి, నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను అనే నినాదంతో దేశాన్ని జాగృతం చేసారన్నారు. ఆయన పోరాట పటిమకు నిదర్శనం గా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మదినాన్ని పరాక్రమ్ దివస్‌గా జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో చమకూర రాజేందర్‌రెడ్డి, వీరేందర్ రెడ్డి, ఎం వెంకటరమణ, నంగునూరు రవిరాజ్, రామగిరి శ్రీనివాస, బైరెడ్డి శ్రీధర్ రెడ్డి, మరాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ : సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధన కోసం యువత నడుం బిగించాలి అని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సుభాష్ నగర్ లో గల భారత స్వాతంత్ర సమరయోధులు సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ 1897 జనవరి 23న జన్మించారని ఆయన జీవితాన్ని భారత స్వాతంత్రం కోసం త్యాగం చేశారని భారతదేశంలో సాయుధ పోరాటం ద్వారానే ఆంగ్లేయులను తరిమికొట్టొచ్చని అన్నారు. సాయుధ పోరాటం ద్వారానే ఆంగ్లేయులను తరిమికొట్టడానికి భారత స్వాతంత్ర పోరాటంలో ప్రధాన పాత్ర పోషించారని, సుభాష్ చంద్రబోస్ 11 సార్లు జైలు జీవితాన్ని అనుభవించారని అన్నారు. ఆయన జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకొని ప్రస్తుతం పాలకులు పేదలకు ఇస్తున్న హామీల అమలుపైన ఉద్యమాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు వై ఓమయ్య, బీ రఘు రామ్, అంజలి, హనుమాన్లు, వంశీ పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో..

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు:ం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఒకవైపు గాంధీజీ మొదలైన నాయకులందరూ అహింసావాదం తోనే స్వరాజ్యం సిద్ధిస్తుందని నమ్మి పోరాటం సాగిస్తే బోస్ మాత్రం సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లేయులను దేశం నుంచి తరిమి కొట్టవచ్చునని నమ్మి, అది ఆచరణలో పెట్టిన వాడని అన్నారు. ఆయన మరణం ఇప్పటికీ ఒక రహస్యంగా మిగిలిపోయిందనీ అన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అందుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఇంచార్జ్ నాగేశ్వరరావు, పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు దంతాల ఆనంద్, బిజినెస్ సెల్ అధ్యక్షులు బొబ్బ నరసింహ రావు, మాక్లూరు మండల అధ్యక్షులు సత్య నారాయణ, శ్రీనివాస్, లక్కోర గోవర్ధన్ గౌడ్, రాములు,ఫిరోజ్, రాజేశ్వర్, పెద్ద గంగారం, కాంతా బాయ్, లక్ష్మమ్మ రమేష్, నాగేశ్వరరావు, విష్ణు, బాలాజీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి మామిడిపల్లిలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ కుమార్ మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం ఈ రోజును "సౌర్య దివాస్" గా నిర్వహిస్తున్నారని అన్నారు. ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించిన సుభాష్ చంద్రబోస్‌కు నేతాజీగా పిలవడం జరిగిందని అన్నారు. నేతాజీని ఆదర్శంగా తీసుకొని యువత ఈ దేశాన్ని అభివృద్ధి చెందుతున్న దేశం నుండి అభివృద్ధి చెందిన దేశంగా చేయడానికి నిరంతరం కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ కార్యదర్శి పులి యుగంధర్, ఖాందేశ్ ప్రశాంత్, గోవింద్ పెట్ సొసైటీ వైస్ చైర్మన్ తూర్పు రాజు, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి పసుపుల సాయి, విజయ సాగర్, మాజీ వార్డ్ మెంబర్ భూమేష్, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారా బ్రిటిష్ వారిని పారద్రోలిన గొప్ప మహనీయుడు సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు

ముప్కాల్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని వేంపల్లి, కొత్తపల్లి, వెంచిర్యాల, నల్లూర్, రెంజర్ల, నాగంపేట్ గ్రామాల్లో మంగళవారం రోజున నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. మండల కేంద్రంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం నేతాజీ జాతికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు గోపినాథ్, యువజన సంఘం నాయకులు చిల్క దినేష్, దాసరి నరేష్, జక్కుల జీవన్, నర్సయ్య, సాయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ : భారత స్వాతంత్ర్య సమరంలో అలుపెరుగని పోరాటయోదుడు మాతృభూమికై జీవితాన్ని త్యాగం చేసిన మహనేత నేతాజి సుభాష్ చంద్రబోస్ అని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య తెలిపారు. ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమానలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. దేశ ఔన్నత్యం సమాజమనుగడకు సమరయోధులు త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్ వద్ద సుభాష్ చంద్రబోస్ 126 వ జయంతి వేడుకలను సుభాష్ యువజన సంఘం అధ్యక్షులు అవదుత గంగాధర్ సుభాష్ విగ్రహానికి చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ చైర్మన్ బాడాల సంతోష్, క్యాషియర్ మేదరి గోపి, సుభాష్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి : మండలంలో గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన సుభాష్ చంద్రబోస్ జయంతిలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాలభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో లోకాని గోపి, మెండె అశోక్, సతీష్ పవర్,గోపి, శ్రవణ్, రాకేష్, లోకాని గంగాధర్, బుట్టి గంగాధర్, యువకులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-లింగంపేట్



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ

మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పనితీరుపై కలెక్టర్ జితిష్ వి పాటిల్‌కు, జిల్లా విద్యాధికారి రాజుకు మంగళవారం ఫిర్యాదు చేసినట్టు ఎంపీపీ గరీబునిసా నయామ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలను ఎంపీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా విద్యార్థులను విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సమాధానం చెప్పకపోవడంతో విద్యాబోధన సక్రమంగా లేకపోవడం వల్లనే విద్యార్థులు సమాధానం చెప్పడం లేదని ఉపాధ్యాయులపై పనితీరుపై మండిపడ్డారు. విద్యార్థులకు పౌష్టికాహారం, కోడిగుడ్లు అందిస్తున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకోగా.. కోడి గుడ్డు అందించడం లేదని వారు సమాధానం చెప్పారు. సంక్రాంతి నుంచి ఇప్పటివరకు కోడిగుడ్లు విద్యార్థులకు అందించలేదన్నారు. ఒకవైపు మధ్యాహ్నం భోజనం సక్రమంగా లేకపోవడం, మరోవైపు విద్య బోధన సక్రమంగా లేకపోవడంతో జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేసినట్టు ఆమె పేర్కొన్నారు.

శివసేన పార్టీ ఆధ్వర్యంలో యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-బోధన్

శివసేన పార్టీ వ్యవస్థాపకులు బాల్‌ఠాక్రే, స్వాతంత్ర సమరయోధులు సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మంగళవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శివసేన పార్టీ ఆధ్వర్యంలో యువకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరంలో యువకులు సుమారు 70 యూనిట్ల రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శివసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పసులేటి గోపి కిషన్ మాట్లాడుతూ.. గత 22 సంవత్సరాలుగా తన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బాల సాహెబ్ ఠాక్రే, సుభాష్ చంద్రబోస్ ఆశయాల కోసం యువత ఎల్లప్పుడూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శివసేన పట్టణ అధ్యక్షుడు ఏనుగంటి గౌతమ్, పాండవుల భూమయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి కిరణ్, శ్రీకాంత్, లోకేష్, లింగం, శ్రీను, లోకేష్, ప్రీతంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

15వ ఫైనాన్స్ యాక్షన్ ప్లాన్ నిధుల ఖర్చులపై సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్


మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శంకర్ అధ్యక్షతన 15 ఫైనాన్స్ నిధులపై మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు సంబంధించిన అధికారులకు నిధుల ఖర్చుపై యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, పశువైద్యాధికారి డాక్టర్ విట్టల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గబ్బర్ సింగ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి, ఈపీఎఫ్ భాస్కర్, ఏపీఓ రమణ, హెడీవో కరిపే రవీందర్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలను పరిశీలించిన డిఈఓ

నవతెలంగాణ- నవీపేట్

మండలంలోని మొకస్ పల్లి కస్తూర్బా పాఠశాలను జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాల సిబ్బందితో సైతం మాట్లాడి విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాణి, సిబ్బంది ఉన్నారు.

తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడికి శుభాకాంక్షలు



షబ్బీర్‌అలీని కలిసిన పలువురు

నవతెలంగాణ-మాచారెడ్డి

కాంగ్రెస్ తెలంగాణ ప్రభుత్వ సలహాదారునిగా నియమితులైన మహమ్మద్ షబ్బీర్ అలీని బంజారాహిల్స్‌లోని తన నివాసంలో మండలానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతుగంటి శ్యాంసుందర్‌రెడ్డి, నౌసిలాల్, మిద్దె నవీన్‌గౌడ్, మల్కాపురం నరేందర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-మాచారెడ్డి

శీతాకాల శిబిరంలో భాగంగా మంగళవారం మండలంలోని లక్ష్మీరావులపల్లిలో 5వ రోజు ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పర్యటించారు. అందులో భాగంగా నిరక్షరాసులు ప్రస్తుతం సైబర్ నేరాల వల్ల మోసపోతున్నారని, ప్రతి ఒక్కరూ అక్షరాస్యత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి రామకృష్ణారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు, జరిమానా

నవతెలంగాణ-కామారెడ్డి

బీబీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపినందుకుగానూ కాటెమ్ సంతోష్ అనే వ్యక్తికి రెండవ తరగతి జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ప్రతాప్ మూడురోజుల జైలు శిక్ష, రూ.300 జరిమానా విధించారు. జిల్లా ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఎవరూ మద్యం తాగి వాహనాలు నడుపవద్దని బీబీపేట్ ఎస్‌హెచ్‌ఓ మండల ప్రజలకు సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ కాయిల్స్ చోరీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

వ్యవసాయ పొలాల వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి కాపర్ కాయిల్స్ దొంగిలించిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మారెడ్డి, రాఘవపల్లి గ్రామ శివారులో గల పొలాల వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి కాపర్ కాయిల్స్ దొంగలించుకుపోయారు. ఎస్ఎస్ 26, ఎస్ఎస్ 43, ఎస్ఎస్31 ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి కాయిల్స్ చోరీ చేశారు. ట్రాన్స్‌కో ఏఈ నిరంజన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల, బాలికల వసతి గృహాలను నిర్మించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండల కేంద్రంలో బాల, బాలికల కళాశాల విద్యార్థులకు సొంత వసతి గృహాలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యూ)నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఎస్.శివ మాట్లాడుతూ మండల కేంద్రంలో బాల బాలికల సొంత వసతి గృహాలు లేకపోవడం వల్ల నిజామాబాద్ రూరల్ విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బంది పడుతున్నరన్నారు. ఎన్నో ఏళ్లుగా పేద విద్యార్థులు సొంత భవనాలు లేక అద్దె భవనాలలో సమస్యలతో వెళ్లదీస్తున్నారని పేర్కొన్నారు. నిజామబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి వెంటనే సొంత వసతి గృహాలు నిర్మించే విధంగా చుడాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్న మేస్ బకాయిలు, స్కాలర్షిప్ లు విడుదల చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్,శివ, రణదీర్,సాగర్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ అభ్యర్థులు సర్టిఫికెట్లు సమర్పించాలి

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

టెక్నికల్ సర్టిఫికేట్ కోర్స్ (టిటిసి) లో డ్రాయింగ్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరి, ఇందుస్తానీ, కర్నాటిక్ మ్యూజిక్ - ఆగష్టు 2023 పరీక్షలలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ ఉత్తీర్ణత సరిఫికెట్లను సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ వి దుర్గాప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, ఐడిఓసి రూమ్ నెంబర్ 103 నందు హాల్ టికెట్లతో పాటు ఆధార్ కార్డ్ జిరాక్స్ సమర్పించాలని పేర్కొన్నారు.

పెట్టుబడీ వస్తలే..



టమాట తెంపుతున్న కూలీలు

- టమాట సాగుచేసిన రైతుల్లో నిరుత్సాహం
- ధర తగ్గడంతో ఆందోళన

నవతెలంగాణ-రెంజల్

టమాట పంటను సాగుచేసిన రైతులు నిరుత్సాహం చెందుతున్నారు. టమాట ధర మార్కెట్‌లో రూ.10 నుంచి 20 వరకు పలకడంతో పెట్టిన పెట్టుబడి సైతం రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెంజల్ మండలంలో పలువురు రైతులు టమాటతో పాటు వివిధ రకాల కూరగాయాల పంటలను సుమారు 500 ఎకరాల్లో సాగుచేశారు. అయితే ప్రస్తుతం మార్కెట్లో టమాట ధర గణనీయంగా పడిపోవడంతో పెట్టిన పెట్టుబడులు సైతం రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పంట సాగుకు భారీగా ఖర్చు చేశామని పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో నష్టంలో కూరుకుపోతున్నామని టమాట పండించిన రైతులు వాపోతున్నారు.

టమాట పంటకు ప్రస్తుత మున్న ధరతో టమాట పంటను కోసే కూలీలకు, రవాణా ఖర్చులకు మాత్రమే సరిపోతుందని, అదనంగా ఎలాంటి ఆదాయం సమకూరడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయం లేదు



నేను రూ.లక్షా 50వేలు పెట్టుబడి పెట్టి ఐదెకరాల్లో టమాట పంటను సాగుచేశాను. నిత్యం రోజుకో సంతకు టమాటను విక్రయించేందుకు వెళ్తాను. మార్కెట్‌లో ధర లేకపోవడంతో ఆదాయం అంతగా ఏమీ లేదు. పెట్టిన పెట్టుబడి సైతం వచ్చేలా లేదు.

- రైతు అరుణ్ ఖాన్, పేపర్‌మిల్.

అదనపు బస్సు సౌకర్యం కల్పించాలి

- విద్యార్థుల రాస్తారోకో

నవతెలంగాణ-బోధన్

సాలురా పరిసర ప్రాంతాల విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం వేళ అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం కళాశాల విద్యార్థులు సాలూర అంతర్ రాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. సాలూర మండలానికి ఉదయం పూట విద్యార్థుల సౌకర్యార్థం అదనపు స్పెషల్ బస్సు కేటాయించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా, నిరసన చేసినా.. ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అలాగే పరీక్షల సమయంలో బస్సులు లేక ఆలస్యం కావడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఆర్టీసీ బస్సు పాసులు తీసుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. తమ నిరసన వద్దకు ఆర్టీసీ అధికారులు వచ్చేవరకు నిరసనను విరమించబోమని హెచ్చరించారు. సమాచారం తెలుసుకున్న బోధన్ రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థులకు రాస్తారోకోను విరమింపచేశారు. విద్యార్థుల రాస్తారోకోతో ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి.



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

నవతెలంగాణ-బోధన్

విద్యార్థులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్ నిధులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్‌బీ బోధన్ డివిజన్ కార్యదర్శి రాజన్న డిమాండ్ చేశారు. మంగళవారం బోధన్ పట్టణంలోని చైతన్య ఒకేషనల్ కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత టీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేసిందని అన్నారు. కావున కొత్త ప్రభుత్వం పెండింగ్లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు వారికి సంబంధించిన స్కాలర్‌షిప్ నిధులు కళాశాలలకు మంజూరు కాకపోవడంతో ప్రైవేట్ కళాశాల నిర్వాహకులు విద్యార్థులను ఫీజుల కోసం ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. అలాగే విద్యార్థుల కాస్మెటిక్ చార్జీలను పెంచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘం నాయకులు గంగప్రసాద్, శివకుమార్, రాము, అశ్విని, జ్యోతి, రమ్య తదితరులు పాల్గొన్నారు.